గౌరంగస్వామి శ్రీకృష్ణచైతన్య జీవితము

చెన్నపురి, 1924

Record no. 195

Gauraṅgasvāmi Śrīkṛṣṇacaitanya jīvitamu

Cennapuri, 1924

Record no. 195

Bibliographic Record Target

గౌరంగస్వామి శ్రీకృష్ణచైతన్య జీవితము / చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1924.

64 p. ;16 cm.

Record no. 195

Gauraṅgasvāmi Śrīkṛṣṇacaitanya jīvitamu / Cennapuri : Vāviḷla Rāmasvāmiśāstrulu aṃḍ Sans, 1924.

64 p. ;16 cm.

Record no. 195

శ్రీ ర స్తు.

గౌరంగస్వామి
శ్రీకృష్ణచైతన్య జీవితము.

చెన్నపురి:

వి. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1924.

Printed
at the 'VAVILLA' Press,
Madras—1924.

శ్రీ రస్తు.

గౌరంగస్వామి

శ్రీకృష్ణచైతన్య జీవితము.

అఖండ భూమండలమునకు మండనాయమానంబై, తేజస్వంతులగు బ్రహ్మర్షులకును, రాజర్షులకును, మహామునులకును, జితేంద్రియులగు మహాయోగులకును, సకలవేదవేదాంగ పారంగతులగు విప్రోత్తములకును, ధనురాది సాధనంబులతోఁ ద్రిలోకంబులనైనం జెనకఁజాలు మహాభుజ బల పరాక్రమవంతులగు రాజపుంగవులకును, కృషి పశుపాలన వ్యాపారాదులచే నొప్పారుచు బహుధన కనకాఢ్యులగు వైశ్యులకును, వినయవిధేయాది సద్గుణసంపదలచే నొప్పారుచు పైమూఁడు వర్ణములవారికి విస్తారముగ నుపకరించుచుండు సచ్ఛూద్రులకును, అత్యున్నతములై యాకసంబున కెగఁబ్రాకియుండు వింధ్య హిమవదాదినగములకును, నగములనుండి సదాస్రవించుచు సమస్త

జీవరాసుల కత్యంతోపకారమును తమచల్లని మధు
రములగు నీటితోఁ జేయుచు నొప్పారు గంగాయ
మునా గౌతమీ నర్మదాది మహానదీ నదముల
కును, నదీనదంబుల తీరంబుల వెలయు మనోహరా
రామంబులకును, ఆరామంబులలోనుండు విద్రుమ
లతాసంకీర్ణంబై బహుపర్ణ పుష్ప ఫలోపేతంబై
దీర్ఘశాఖలతో నొప్పారు వృక్షములకును, వృక్షచ్ఛా
యలఁ గదలిక లేక కాపురము జేయుచు, ఎన్నటికి
విసుగుఁ జెందక, విసుగుపుట్టింపక నతిమనోహర
గానము సలుపుచు తమ కులాయములయందు
కోలాహలములఁ జేయుచుండు వివిధపక్షిరుతముల
కును, పక్షిరుతముల నాలించుచు, వానిశృంగార
చేష్టలకు సంతసించుచుండు కవిపుంగవులకును,
కావ్యములయందును గ్రంథములయందును వెల్లడి
పఱుపఁబడి ప్రపంచమునంతటికిని ఆర్యనాగరక
తా వెలుగును గలిగించిన వివిధశాస్త్రములకును,
శాస్త్రపఠనమునకు దేశదేశములయందుండి విద్యా
ర్థుల నాకర్షించుచు విద్యాపీఠములైన పాటలీ
పుత్రము, వారణాసి, నవద్వీపము, తక్షశిల మొద
లగు నుత్తమోత్తమ పురాతనపట్టణములకును
మిక్కిలి ప్రశస్తిజెంది కలుముల కిరవై, పలుకుల
వెలంది కాటపట్టైవెలయు భరతఖండమునకు అలం

కారమై శోభించు దేశము బంగాళమనునది యొకటి
గలదు. ప్రస్తుతాంశము ననుసరించిన కాలమున
భరతదేశము అన్యాక్రాంతమై, నూతనమతస్థులకు
నెలవైనది. వారే పాలించు ప్రభువులైరి. విగ్రహా
మునారాధించు హిందువులకును, విగ్రహారాధన
మన్న నిప్పులుగ్రక్కు నూతనమతస్థులకును ఒరిపిడి
దేశమందంతా కలిగెను. ఢిల్లీరాజ్యమును అప్పుడీ
మతస్థులగు లోడీవంశస్థులు పాలించుచుండిరి.
లోడీవంశము సామ్రాజ్యస్థానము నామకార్థముగ
నితరదేశములపై గలిగియుండెను. బంగాళము
పాలించుచుండిన మహమ్మదీయ అధికారి స్వతంత్రుఁ
డాయెను. ఈనూతనరాజుల మతము మహమ్మదీయ
మతము. ఈమతరాజులు ఆవేశపూరితులై భరత
ఖండమంతా రాజ్యకాంక్షులై దాడివెడలి హిం
దూరాజ్యముల నాక్రమించుకొనిరి. ప్రజలధనము
లను కొల్లగొట్టిరి పవిత్రదేవాలయములను రూపు
మాపిరి. ఒకబంగాళమేనా మగధ, కోసల, కన్యా
కుబ్జ, గుజరాతు, మాళవాది ప్రసిద్ధహిందూరాజ్య
ములను పాలించుచుండిన హిందూరాజులు యవను
లఎదుట తమఖడ్గములను క్రిందవైచిరి.. కన్నీరు
విడుచుచు తమ సింహాసనములను యవనరాజుల
కప్పగించిరి. భారతీయరాజాస్థానములు ఒకటివెం

బడినొకటి యవనానలమునందు కమలిపోయెను. భారతీయుల స్వాతంత్ర్యము లడుగంటినవి. సర్వ ధర్మములు గమనోన్ముఖములైనవి దేశమంతయు మహమ్మదీయుల ఇంద్రియలోలత్వమునకు లొంగి పోయినది. యవనాక్రాంతమైనది మొదలు అర్థపురుషార్థము దేశమున అన్యాధీనమైనది. ధర్మదేవత యొంటికాలిమీద నడువనారంభించినది. కాలప్రాప్తమైన పరాధీనతను జనులు తప్పించుకొనలేక పోయిరి. తమ శాస్త్రములను, తపస్సులను, వేదములను విడనాడి భారతీయులు సువర్ణమోహితులై యవనహస్తగతమైన అర్థమే పరమార్థమనుకొనిరి. అర్థదాస్యరూపమగు దీనదశనుండి విద్వాంసులు, శాస్త్రజ్ఞులు తప్పించుకొనలేకపోయిరి ఉత్తమపురుషార్థములు నశించినవి. అర్థదాస్యము అనంగసేవ పరమపురుషార్థములాయెను. అర్థముదూరమై పోవుకొలది దానియొక్క బృహద్రూపము భారతీయ ప్రజలకు విశ్వరూపమాయెను. ఆత్మాధీనతను భారతీయులు గోల్పోయిరి. ఉమాస్వాతి తత్వార్థదిగమ్యుతము, భద్రబాహుయొక్క జైనసన్న్యాస పటలము, ఆర్యభటుని జ్యోతిశ్శాస్త్రము, సిద్ధార్థుని అహింసోపదేశము, బాదరాయణుని వేదాంతము, పతంజలి యోగశాస్త్రము ఇవన్నియు యవనుని

మతావేశమునకు ముందరనిలువ నీడలేకపోయినవి. వంగీయులెల్లరు కొందఱుతప్ప ఇంద్రియ దృష్టిపరులైరి. భారతదేశమంతయు యవనాక్రాంతమై అపవిత్రమైనది. వేదశాస్త్రముల నభ్యసించిన బ్రాహ్మణోత్తములుసయితము వేదశాస్త్రాధారమున నిలువబెట్టఁబడిన పరబ్రహ్మముయొక్క పరమార్థమును సందేహింపసాగిరి. సువర్ణమే పరమార్థమని తలంచిరి. ఇట్టి అధర్మప్రపంచము నుద్ధరించుటకును, కాలమున కనుకూలముగ జాతిమతభేదములతో నవసరములేక సమస్తజనులకును భక్తిమార్గమును బోధించుటకును, జ్ఞానసంపదగల బ్రాహ్మణకుటుంబమున ఒకమహాపురుషుఁడు పరమభాగవతోత్తముఁడు బంగాళాదేశమునందు క్రీస్తు 15-వ శతాబ్దాంతమున అవతరించెను.

ఏది బయలువెడలినను భారతదేశములో బంగాళమునందు బయలు వెడలవలయును. ఆర్యావర్తముసుమా అది. ఋషులు వేదాంతాలు పాడిరి అక్కడ జ్ఞానులు ఉపనిషత్తులు చెప్పిరి. ఆచోటున శాస్త్రులు శాస్త్రాలు రచించిరి. ఆదేశమున కవులు కావ్యాలువ్రాసిరి. అచ్చటిపట్టణములలో, సరస్వతీ మందిరాలున్నవి. ఆప్రదేశములో విద్యాపీఠాలు వెలసినవి. బంగాళములోనే రాజకార్య ధురంధ

రులు, సంఘసంస్కర్తలు, మతబోధకులు, కావ్యకర్తలు, వీరువారననేల గొప్పవారందఱు అక్కడ మొదట బయలుదేరిరి. పైన నుదహరింపఁబడిన మహాపురుషుఁడు శ్రీకృష్ణచైతన్యస్వామి సైతము బంగాళముననే గంగాతీరంబున నవద్వీపమను పురాతననామముతో వెలయుచుండు నడియాయను పట్టణమున క్రీ. 1486-సం. ఫిబ్రవరి 18-వ తారీఖున శచీదేవి జగన్నాథమిశ్రులు అను దంపతులకు పుట్టెను.

ఈదంపతులకు మొదట ఎనమండ్రు ఆడబిడ్డలు గలిగి అందఱునుగతించిరి. పిదప తొమ్మిదవచూలు శచీదేవిదాల్చి మొగబిడ్డనుగనెను. అతనికి విశ్వరూపుఁడను పేరిడిరి. ఈవిశ్వరూపుఁడు పసితనముననే వేదవేదాంగ శాస్త్రసంపన్నుండై పదియాఱవ ఏట వైరాగ్యమునుబొంది సన్న్యసించెను అప్పటినుండి అనేకదేశములలో నాలుగేండ్లు గ్రుమ్మరి పిదప పండరీక్షేత్రమున సిద్ధిఁబొందెను.

విశ్వరూపునిఁ గనిన పిదప శచీదేవి కొన్నాళ్లకు మరల చూలాలై మఱియొకమగవానిని గనెను. ఈకాన్పు నామె యొకవేపచెట్టు (నింబవృక్షము) క్రిందకనుటచే నాశిశువునకు 'నిమి' అని పేరిడెను. నిమి జన్మించినప్పుడు సూతికాస్థలము ఒకదివ్యతేజ

స్సుతో నావరింపఁబడి కోటిసూర్యప్రభతో ప్రకాశించుచుండి కొంతసేపటికి మాయమైపోయెను. నిమిదేహచ్ఛాయ బంగారుతామరపుష్పపుకాంతివంటిది. మిక్కిలి అందగాఁడు. దేహమునందుండి అప్పుడప్పుడు అపరూపమైన దివ్యతేజస్సు ఒకటి కాన్పించుచుఅణగుచుండును. నడచునప్పుడు గజ్జెలు అందెలు లేకయే ఘల్లుఘల్లుమని ధ్వని వినఁబడుచుండును. శిశువుగానుండినపుడు ఎప్పుడైన నేడ్చినచో కృష్ణస్మరణను చేసిన మాత్రమున రోదనమాగిపోవును. కిలకిలమని నవ్వులకు ప్రారంభించును. ఈతనికి ప్రీతిగలతల్లి 'నిమి' యని ముద్దు పేరిడెను గదా? అభిమానముగల తండ్రి 'విశ్వంభరుఁడ'ని పేరిడెను. ఈతఁడు తనగురువులవలన కృష్ణచైతన్యుఁడనే బిరుదుతో వెలసెను. ఉపనయనకాలము మొదలు గౌరంగుఁడు అను ప్రవరనామధేయముతో ప్రఖ్యాతిగాంచెను. గాయత్రి ఉపదేశించుసమయమునకీచుమని యొకకూత వేసిమూర్ఛిల్లెను. వెంటనే ఉపనయనమంటపమంతయు ఒకదివ్యతేజస్సుతో నావరింపఁబడి కొంతకాలమున కాకాంతి అణగిపోయెను. వెంటనే గౌరంగుఁడు మూర్ఛదేఱెను. గౌరంగునితండ్రి జగన్నాథమిశ్రులు గౌరంగుని పదునొకండవఏట మరణించెను. అప్పటినుండి తన

కన్నబిడ్డలలో తనకు దక్కినవాఁడొక్కఁడే యగు గౌరంగుని, తల్లి శచీదేవి మిక్కిలి గారాబముతో జాగ్రత్తగా పెంచుచుండెను

శిష్యత్వము, విద్యాభ్యాసము.

గౌరంగుఁడు గంగాదాసు అను బ్రాహ్మణునివద్ద సమస్తవేదశాస్త్రములను అభ్యసించెను వీరికి తర్కవ్యాకరణశాస్త్రములలో విశేషపాండిత్యము. పదునెనిమిదిసంవత్సరముల ప్రాయముననే బంగాళాదేశమున గొప్పవిద్వాంసుఁడని ప్రఖ్యాతిజెంది నిమిపండితుఁడని పిలువఁబడసాగెను. నవద్వీపమున నొకశాస్త్రపాఠశాల నేర్పఱచెను. అదియనేకవిద్యార్థుల నాకర్షించినది. నిమిపండితుఁడు విద్యార్థుల కందఱకు బోధపడునట్లు శాస్త్రపాఠములను జెప్పుటచే నాపాఠశాలలోఁ జదివిన విద్యార్థులు అనేకులు మహాపండితులైరి. ఆగొప్పపండితులందఱును నిమిపండితునకు శిష్యులగుటచే బంగాళాదేశమందంతటను నిమిపండితుని ఖ్యాతి విస్తరిల్లెను. నిమిపండితుఁడు తూర్పుబంగాళాకుపోయి కొంతకాలముండి ఆచోటననేకులకుకృష్ణభక్తిని ఉపదేశించెను అచ్చటివారనేకులు వీరిని పూజ్యభావముతో గురువుగా చూచుచుండిరి పిదప నిమిపండితుఁడు తన స్వస్థానమునకు ఏతెంచెను. ఈలోపుగా నిమిపండితుని

భార్య లక్ష్మీదేవి కాలధర్మము నొందెను. ఇంత గొప్పపండితుఁడై కీర్తిగడించిన కొడుకు విధురుఁడై యుండుట కిష్టపడక, తల్లి శచీదేవి, విష్ణుప్రియయను మఱియొకకన్యను గుణరూపశీలములు గలదానిని పెండ్లిచేసి స్థిమితచిత్తురాలాయెను.

నిమిపండితుఁడు గయకుఁ బోవుట.

పిదప కొన్నినాళ్లకు నిమిపండితుఁడు శిష్యులు కొందఱితోఁగూడి గయాక్షేత్రమునకుఁ బోయి అచ్చోట విష్ణుపాదమున పితరులకు పిండదానము చేసెను. ఆకాలమున పితరులను భక్తితో ధ్యానించుచుండ నొడలు మఱచి కొంతసేపు వెక్కివెక్కి ఏడువసాగెను. పిదప జ్ఞప్తితప్పి నేలపైపడి పొర్లాడసాగెను. అప్పుడు వీరికిపరిచితులగుసన్న్యాసి ఈశ్వరపురి యనువారు సేదదేర్చగా మరల స్మృతిగలిగి అప్పటినుండి కృష్ణా కృష్ణా యనుచు, శ్రీకృష్ణనామస్మరణయం దాసక్తచిత్తుఁడై, తదేకధ్యానపరాయణుఁడై, ఒకప్పుడు తనలో తాను నవ్వును. ఇంకొకప్పుడు కృష్ణుఁడు కానరాఁడే యని ఏడ్చును. మఱియొకప్పుడు దవ్వునకృష్ణునిచూచినవానివలె యానందించును. ఇట్టిచిత్తముతో నొకసమయమున శ్రీకృష్ణమూర్తి తనకుదర్శనమీయలేదే యని దుఃఖించుచుండ ఆలోకారాధ్యుఁడు, ఆపరాత్పరుఁడు

యశోదానందనుఁడు, క్రీడలమారి, నిమిపండితునకు
అగుపడి పండితుని కౌఁగలించుకొని యదృశ్యమై
పోయెను. ఈతీరున వ్యాకులచిత్తుఁడగు నిమి ఎట్ట
కేలకు గయాక్షేత్రయాత్ర పూర్తిజేసికొని బహు
ప్రయాసతో నిల్లుచేరెను. కొడుకుయాత్ర పూర్తి
చేసికొని ఇల్లుచేరెనుగదా, అని తల్లిశచీదేవి సంత
సిల్లెను. అయితే అతనిచిత్తము మారియుండుటను
మాత్రము ఎఱింగెను. ఆదినము నిమిభార్య 'భర్తా
గమోత్సవో నార్యాః' అన్నట్లు తనమనస్సుసంతోష
ముప్పొంగ రాత్రి శయనగృహము నలంకరించి, పర
మేశ్వరుని ఆలింగనముచే పావనతఁ జెందిన భర్త
దేహమును కౌఁగలించుటకు నువ్విళ్లూరుచుండెను.
రాత్రి వేళయైనది నిమి శయనగృహమునకు చేరెను.
భార్యయు నాగదిలోనికి వెళ్లెను. వెళ్లగానే తనభర్త
పడకటూఁదపడి పొర్లుచు కన్నీరు గార్చుచు రోద
నము చేయుచుండుటను గనెను. వెంటనే విష్ణు
ప్రియాదిగులొంది శచీదేవియున్నస్థలమునకుఁబోయి
'అమ్మా, మీకుమారుని చూతురరండి' అనెను.
శచీదేవియు, విష్ణుప్రియయు ఆపడకగదిని దరిసిరి.
అచ్చట ఒకదివ్యతేజస్సు వెలుగుచుండెను అదిసూ
ర్యప్రభతో సమానమైనది. అందులకు వారాశ్చర్య
పడిరి. ఇరుగుపొరుగు వారిని కూర్చిరి. నిమితో యా

త్రకుపోయి యూరికి వచ్చిచేరినవారు వచ్చి నిమిని
చూచిరి. వారు 'అమ్మా! నీకుమారుఁడు సామాన్య
మానవుఁడుగాడు. మహాభక్తుఁడు. కేవల మవతార
పురుషుఁడు. అనుచు దారిలో నచ్చటచ్చట జరిగిన
నిమివృత్తాంతములను నిమితల్లికిని, భార్యకును దెలి
పిరి. వెంటనే నిమిని దైవస్వరూపుఁడని అందఱును
ఉపచారములచేసిరి. స్మృతి గలిగెను. అప్పటినుండి
నిమిపండితుఁడు శిష్యులకు తర్క, వ్యాకరణ,
వేదాంతశాస్త్రబోధలను మాని శ్రీకృష్ణభక్తిని
బోధింప దొడంగెను.

తపనమిశ్రుఁడు - నిమిపండితుఁడు.

నిమిపండితుఁడు 18 ఏండ్ల ప్రాయముగలవాఁడై
నుండునపుడే తూర్పుబంగాళాకు పోయియుండెనని
చెప్పియుంటిమి. ఆదేశమున నిమివిద్వత్తునకు ఆశ్చ
ర్యపడి అనేకులు విద్యార్థులైరి. విద్యార్థులతో పరి
వేష్టింపఁబడి సదా విద్యావ్యాసంగ నిమగ్నుండై
యుండు నిమిపండితుని సమీపమునకు మిక్కిలి వ్య
సనాక్రాంతుఁడై యొకవిద్వాంసుఁడు తపనమిశ్రుఁ
డను బ్రాహ్మణుఁడు వచ్చి యాతనికి సాష్టాంగముగ
మ్రొక్కెను. అచ్చట నుండువారందఱు అచ్చెరు
వోయిరి. ఏలయన, నిమిపండితుఁడు వయస్సున
చాలచిన్నవాఁడు. మ్రొక్కినబ్రాహ్మణుఁడు బహు

విద్యాపారంగతుఁడైన ముసలిబ్రాహ్మణుఁడు. ఇట్లు
తపనమిశ్రుఁడు నిమికి మ్రొక్కఁగా నిమి లేచి యాపా
ఱుని లేవనెత్తెను. అప్పుడు తపనమిశ్రుఁడు ఇట్లుచె
ప్పెను. 'స్వామీ! నేను బహుకాలము ఈశ్వరస్వ
రూపము తెలియగోరి అనేకదినములు బహువిధ
ములగు తపము లాచరించితిని. అనేకులగు పెద్దల
సేవించితిని. ఎన్నినాళ్లకును ఈశ్వరస్వరూపమును
గుర్తించలేకయున్నాను. ఇట్టివిచారముతో నుండు
నాకు రాత్రి యొకస్వప్నమాయెను. ఆస్వప్నమున
ఈ దేశమునకు ఇప్పుడువచ్చియుండు నిమిపండితుఁడు
అనువిద్వాంసుఁడు నాకు ఈశ్వరస్వరూపము
నెఱుంగు నుపాయము దెలుపుననియు, మీపాదసే
వఁజేసిన నాయిష్టమీడేరుననియు నొకయశరీరి
చెప్పినట్లు మాటలువింటిని. కావున మీరు పసివా
రైనను బ్రాహ్మణులలో జ్ఞానశ్రేష్ఠుఁడే పెద్దఅని శా
స్త్రముండుటచే ఈశ్వరస్వరూపమును తెలియగోరి
జ్ఞానులగు మీపాదములపై బడితిని. నాకు తరణో
పాయము తెలుపవేడెద'ననెను. వెంటనే నిమిపండి
తుఁడు తపనమిశ్రుని కౌఁగలించుకొని, తాను ఆవల
నొకానొకప్పుడు కాశీక్షేత్రమునకు రానున్నానని
యు నావరకు తపనమిశ్రుఁడు క్షేత్రవాసము గావిం
చుచుండవలయు ననియుఁ జెప్పి, కొన్నిరహస్య

విషయములను బోధించిపంపెను. అచ్చటికి వేయి
మైళ్లదూరముననున్నది కాశీక్షేత్రము. తపనమి
శ్రుఁడు నిమిపండితుని ఆజ్ఞను శిరసావహించి వెంట
నే కాశికి తరలిపోయెను. నిమిపండితుఁడు తూర్పు
బంగాళాలో దిగ్విజయము సలిపి అనేకశిష్యబృంద
ములతో మరల నవద్వీపముచేరెను.

కేశవపండితుఁడు - నిమిపండితుఁడు.

నవద్వీపము విస్తారపాండిత్యముగల విద్వాంసు
లకు ఆకరమని మున్నే తెలిపియుంటిమి. నిమిపండి
తుఁడును నవద్వీపపురవాసి భరతఖండమునందలి
యన్నిచోట్లనుండి విద్వాంసులనేకులు పాండిత్య
ప్రకటనమును గావించి అచ్చటివారికంటె మేలైన
వారని అనిపించుకొనుటయో, లేక కీతవారని అని
పించుకొనుటయో ఆకాలమున ఆచారమైయుండి
నది. ఆయాచారముమేరకు కేశవపండితుఁడను ఒక
విద్వాంసుఁడు అనేకదేశములలో బహువిద్వాంసు
లను వాదములయందు ఓడగొట్టి విద్వత్సభలలో
ధనరాసులుగడించి నవద్వీపమునకు తనపాండిత్య
ప్రకటనకేతెంచెను. నవద్వీపమున నిమిపండితుఁడు
గొప్పవిద్వాంసుఁడు. అతనిని జయించినచో కీర్తి
రాగలదని అచ్చటికివచ్చి కేశవపండితుఁడు చేరెను.
పట్టణమంతయు ఒకగొప్పవిద్వాంసుఁడు ధనరాసు

లతో వచ్చియున్నాడు. అతనితో ప్రసంగముఁజేసి గెలిచినచో సాధనరాసులను గెలుపొందిన పండితునకు యిచ్చుచున్నాడనియు, తనశిష్యులతో గెలిచినపండితుని శరణుఁజొచ్చుననియు, తాను గెలిచినచో వాదించినపండితుఁడు తనకుశిష్యుఁడు కావలయుననియు దండోరా వేయించెను. నవద్వీపము విద్వాంసులకు పుట్ట. ఎవ్వరును దండోరాను లక్ష్యపెట్టినవారుకారు. నిమిపండితునకు గౌరంగస్వామి అని నామాంతరము ఇప్పటికిప్రసిద్ధిజెందినది. ఈగౌరంగస్వామిని గెలిచినచో తనకు కీర్తిగలుగునని తలచివేచియుండెను. ఒకానొకనాటిరాత్రి గంగాతీరపు సైకతస్థలియందు కొందఱిశిష్యులతో గౌరంగస్వామి విద్యాగోష్ఠియందుండెను. అచ్చటికి కేశవపండితుఁడు తనశిష్యబృందముతో నేతెంచుట తటస్థించెను. కేశవపండితుని చూడగనే గౌరంగస్వామిలేచి మర్యాదతో తనప్రక్కన కూర్చుండ నియమించెను. ఇరువురు యోగక్షేమముల కొంత నరసికొనిరి పిదప గౌరంగస్వామికి ప్రియముగొల్పువాఁడై వారి ఇష్టముపై కేశవపండితుఁడు ఆపండువెన్నెలను, గంగాతీరమప్పటిస్థితిని వర్ణించుచు ఆశుకవిత్వముగా 200-శ్లోకములను జెప్పెను. గౌరంగస్వామి వానిలోనొక్కశ్లోకమును తాను మరల

చదివి దాని తాత్పర్యమును కేశవపండితుని విడదీసి చెప్పుమనెను. కేశవపండితుఁడు ఆశ్లోకములోని భావమునుపన్యసించఁగా నందు భావము కుదురలేదని నిరూపించి పూర్వపక్షముచేసెను. తనభావమును కేశవపండితుఁడు సిద్ధాంతము చేయలేక పోయెను. కేశవపండితునకు తలవంపులాయెను. స్వామిశిష్యులు స్వామిమహిమకు అత్యాశ్చర్యపడిరి కేశవపండితుఁడు విద్వాంసుఁడుగాన తనతో వాదించునప్పుడు స్వామివారిధోరణిని, వాక్శుద్ధిని విని తనకంటె స్వామి ఎన్నిమడుంగులో విద్యాధికుఁడని తెలిసినవాఁడై స్వామికి పాదాక్రాంతుఁడాయెను. తనకు ముక్తిమార్గము నుపదేశింపమని వేడెను. గౌరంగస్వామి కేశవపండితున కుపదేశించినది పలానిదని ఎవరు నెఱుంగరు. ఉపదేశముకాగానే కేశవపండితుఁడు మాత్రము తనవాసస్థానమునకు బోయి తనవస్తువాహనములను, సేకరించితెచ్చిన ధనరాసులను బీదలకు దానముచేసి తా నేకాకియై యెచ్చటికో పోయెను. ఇంతగర్వపడివచ్చిన పండితుని జయించి వానిని తనకు మ్రొక్కునట్లుచేసిన గౌరంగస్వామిప్రజ్ఞను, పాండిత్యమును, నవద్వీపవాసులు అనేకవిధముల బొగడిరి.

వీరిరువురి సమాగమమున నొకచిత్రమైనకథ

నాకాలపువారు చెప్పుకొనుచుండిరి. కేశవపండితునకు సరస్వతీదేవి ప్రత్యక్షమట. ఆదేవత యనుగ్రహమున కేశవపండితుఁడు లోకములోని పండితులను గెలువగలిగెనట. గౌరంగస్వామి మానవకోటిలోఁ జేరినవారు కారనియు, వారు కలియుగమున వేదధర్మములు క్షీణించగా, జనులకు నూతనముగ భక్తిమార్గము నొకదాని నేర్పఱచి దానిగుండా వారికి తరణోపాయము గలిగించుటకై శ్రీకృష్ణమూర్తియే భూలోకమున నీసమయమున నీరూపముతో నవతరించెననియు, నట్టి శ్రీకృష్ణావతారమూర్తిని శ్రీసరస్వతి ప్రసాదముండినను కేశవపండితుఁడు గెలువలేకపోయి తనయోటమికి కారణము, నానాటిరాత్రి సరస్వతీదేవిని యడిగినట్లును, దేవి కేశవపండితునకు సంపూర్ణముగ విద్యనొసంగి యాతనికి తరణోపాయమును నేర్పుటకై శ్రీకృష్ణావతారముయొక్క అపరరూపమగు గౌరంగస్వామిచే నోటమి గలిగించెననియు, నందుచే కేశవపండితుఁడు శ్రీసరస్వతీదేవియాజ్ఞను బడసి శ్రీగౌరంగస్వామిని తనకు తరణోపాయమును నేర్పుమనగా స్వామి యుపదేశమేమో చేసిరనియు, నాయుపదేశమునకు ఫలితమో యనునట్లు కేశవపండితుఁడు

విరక్తుఁడయ్యెననియు నొకవృత్తాంతము దేశములో ప్రబలినది.

కృష్ణావతారస్వరూపుఁడగు గౌరంగస్వామి, బలరామావతారస్వరూపుఁడగు నిత్యానందస్వామితోఁ గలిసికొనుట.

గౌరంగస్వామి (నిమిపండితునికి) విశ్వరూపుఁడను జ్యేష్ఠుఁడు భ్రాతయొకఁడుండి అతను పండరీక్షేత్రమున సన్న్యసించి సిద్ధిఁబొందెనని ఇదివరలో తెలిపియుంటిమి. ఈవిశ్వరూపుఁడు తాను పండరీక్షేత్రమునకు బోవుసమయమున నిత్యానందుఁడను వానిని వెంటఁబెట్టుకొనిపోయెను. ఈనిత్యానందుఁడు తన పదునాలుగేండ్లవయస్సునందే సన్న్యసించి, అప్పటినుండి దేశములలో దిరుగుచు ప్రతిస్థళమున భక్తిపరవశుఁడై కృష్ణగానముచేయుచు, కృష్ణుని వెతకుచు బృందావనమునకుఁబోయెను. అచ్చోట సదా కృష్ణమానసచిత్తుఁడై ఒకప్పుడు నవ్వును. ఒకప్పుడు ఏడ్చును. ఒకప్పుడు గంతులువేయును. ఇట్టిస్థితిని ముందు గౌరంగస్వామి ఇదేవిధమున గయాక్షేత్రమున చరించగా వారిని ఓదార్చిన ఈశ్వరపురి యను సన్న్యాసి బృందావనమున నిత్యానందుని యల్లాటమును జూచి నిత్యానందునితో "నీవు నవద్వీపమునకుఁ బోయి

నచో కృష్ణమూర్తిని చూడఁగలవు"అని చెప్పెను. వెంటనే నిత్యానందుఁడమితానందమగ్నుఁడై బహుదినప్రయాణకష్టమునకోర్చి కొన్నాళ్లకు నవద్వీపమును జేరెను. నిత్యానందుఁడు నవద్వీపమునకు రాను రెండుమూడురోజులకు పూర్వము గౌరంగస్వామి తనశిష్యులతో కొన్నినాళ్లలోనే నవద్వీపమున కొకమహనీయుఁడు రానున్నాఁడని మందలించుచుండెను. నిత్యానందుఁడు నవద్వీపముచేరిన పిదప గౌరంగస్వామి శిష్యులనుబిలచి 'నేనిదివరలో చెప్పుచుండిన మహనీయుఁడు ఈయూరికి వచ్చియున్నాఁడు. మీరుపోయి ఆతనిని నాయొద్దకు వెదకి పిలుచుకొనిరండు.' అనెను. ఆశిష్యులు వెదుకఁబోయి కానక గౌరంగస్వామియొద్దకు మరల వచ్చి తమకు వారుండుస్థలము తెలియలేదనిరి. వెంటనే గౌరంగస్వామి శిష్యులతో బయలుదేఱి నిత్యానందులుదిగియుండు ఒకబ్రాహ్మణునిఇంటికిచాయగాబోయిఆవాకిలితిన్నెమీఁద నాసీనుఁడై యుండినఒక నీలమేఘచ్ఛాయగలదేహముకాంతివాఁడును, దీర్ఘబాహువులుగలవాఁడును, గొప్పకన్నులు గలవాఁడును, గంభీరాకారముగల నిత్యానందుని అనేకదినములుగ పరిచితుఁడైన స్నేహితుఁడు బహుకాలము దేశాంతరమునకుఁ బోయియుండి మరలి వచ్చుచో

నట్టివాని నెట్లు ఎదుర్కొనునో అట్లు గౌరంగస్వామి నిత్యానందుని మందలించెను. నిత్యానందుఁడు స్వామికంఠధ్వని వినగానే మైమఱచి, ప్రజ్ఞ దప్పి రోదనముచేసెను. నిత్యానందునకు గౌరంగస్వామి సేదదీర్చి నెమ్మదిగా తనఇంటికి పిలుచుకొని పోయి తల్లి శచీదేవితో 'అమ్మా నీపెద్దకుమారుఁడు వచ్చియున్నాఁడు.' అనెను. ఆమెయు నిత్యానందుని స్వరూపము తనపెద్దకుమారుని స్వరూపమువలెనే యుండినందున తనపెద్దకుమారుఁడే మరల వచ్చెనని యానందించెను.

గౌరంగస్వామి కృష్ణావతారమూర్తియనియు, నిత్యానందులు బలరామావతారమూర్తియనియు, ఆబలరామకృష్ణులు ధర్మసంస్థాపనార్థముగ మరల కలియుగమున జనులకు భక్తిమార్గము నుపదేశించుటకు అవతరించినారనియు నప్పటినుండి బంగాళములో బహుకాలముగ నిప్పటికిని వదంతి యొకటి కలిగినది. ఇప్పటినుండి గౌరంగస్వామియు, నిత్యానందులును ఒకరిని వదలి ఒకరుండినవారు కారు. బలరామకృష్ణులు ద్వాపరాంతమున నెట్లు మెలగిరో అట్లే వీరును క్రీస్తు తర్వాత పదునైదవశతాబ్దాంతమున లోకమున ధర్మసంస్థాపనకై మరల యవతరించిన బలరామకృష్ణులుగానే చరించిరి.

గౌరంగస్వామి, వాసుదేవుఁడు.

ఇప్పటికి గౌరంగస్వామి శిష్యులకు. తర్కవ్యాకరణశాస్త్రములను బోధించుటను మానివేసెను. తనచుట్టుచేరినవారికి సదా కృష్ణమంత్రమును జపించుమని బోధించుచుండును తాను అన్నికాలములయందును ఏమరక కృష్ణధ్యానపరాయణుఁడై తనలోతాను నవ్వును. ఉన్నట్టుండి వెక్కివెక్కి ఏడ్చును. ఇట్లుండగా స్వామివారికి చిత్తచాంచల్యము కలిగినది. వెఱ్ఱివాఁడాయెను. కాకున్న ఇట్టియులికిపాటు, తనలోతాను నవ్వుట, ఉన్నట్టుండి ఏడ్చుటలు పొడమునా యని కొందఱు వీరిసిద్ధావస్థను అస్వస్థచిత్తమని తెలిసికొని స్వామివారితల్లి శచీదేవియొద్దకుఁ బోయి వారిని యౌషధసేవ చేయించినం గాని ప్రపంచజ్ఞానమున వారుపయోగపడలేరనియునగా, శచీదేవి యూరిలోని వాసుదేవుఁడను తనభర్త చెలికానిని, వయోసంపన్నుని ప్రార్థించి తనకుమారుని స్థితిని చూడమనెను. ఆవాసుదేవుఁడును స్వామివారింటికేతెంచెను. వెంటనే గౌరంగులు వాసుదేవుని చూచి నమస్కరించి తనస్థితిని చక్కఁగ పరిశీలించి తనతల్లికి వాస్తవవిషయమును చెప్పుమనెను. శ్రీ వాసుదేవుఁడు స్వామిరూపమును తేరిపాఱఁజూచి, వారి యువయవసౌందర్యమును, దేహకాంతిని కను

గొని ఈతఁడు వెఱ్ఱివాఁడు గాఁడు, రోగి కాఁడు. పూర్వజన్మతపస్సుయొక్క ఫలము. యోగుల సిద్ధావస్థయందున్నాఁడు. పరమపావనమూర్తి. భక్తుఁడు. అని యాలోచించి శచీదేవిని చూచి 'అమ్మా! నీ కొమారుఁడు ప్రహ్లాదనారదాది పరమభాగవతోత్తములలో జేరఁదగినవాఁడు గాని సామాన్యుఁడు కాఁడు. ఈతనికి ఉన్మాదములేదు ఈతఁడు కృష్ణభక్తుఁడు. ఈతనియవస్థ సిద్ధావస్థ. అందుచే దోసగు లేదు. ఇతరులమాటలను వినవలదని ఖచితముగా చెప్పెను.

వాసుదేవుఁడాసంగతులను శచీదేవికి చెప్పినంతటనే గౌరంగస్వామి వాసుదేవుని కౌఁగలించుకొనెను. వాసుదేవుని దేహమునగగుర్పాటుపొడమెను. నేత్రములయందుండి ఆనందబాష్పములు రాలెను. వెంటనే వాసుదేవుఁడు మైమరచి గౌరంగస్వామి పాదములమీఁదఁబడి 'స్వామీ! భక్తిలేనిజన్మము వ్యర్థము. ఎన్నిశాస్త్రముల నభ్యసించినను, కనక రాసులెన్నిపోగుచేసినను, భక్తికీడైనవస్తువు వేరొండున్నదా? యని నిత్యానందునితో స్వామిని తన ఇంటికిఁ బిలుచుకొనిపోయెను.

వీరితోఁగూడ గదాధరుఁడను భక్తుఁడు కూడుకొనెను. గౌరంగస్వామి, నిత్యానందుఁడు, వాసు

దేవుఁడు, గదాధరుఁడు ఇంక ననేకులుచేరి అప్పటి నుండి వాసుదేవునిఇంట భగవత్కాలక్షేపములు, భజనలు వీనిలో నోలలాడుచుండిరి. అనేకులు ఈ గానమును వినుటకు పోవుదురు. భజనకాగానే శ్రీ నారాయణుని స్తోత్రపాఠములతో తృప్తిపరతురు. వెనుక గౌరంగస్వామి రెండుచేతులనుపైకెత్తుకొని నృత్యము గావింతురు. ఇట్లు ప్రతినిత్యము రాత్రిళ్లు తెల్లవాఱువరకు భగవద్భక్తులతోఁగూడి కాలక్షేపము చేయుచుండెను గౌరంగస్వామి. అసూయాపరులు కొందఱు ఈ భగవత్కైంకర్యము నేవగించసాగిరి. కీర్తనలను పాడువారినందఱను నవాబు శిక్షించునని దుర్వార్తలు పుట్టించిరి.

ఇట్లు మూఁడుమాసములు భజనలు, కాలక్షేపములు, వాసుదేవునిఇంట జరిగినది. ఒకదినము ఉదయమున వాసుదేవుఁడు గంగాస్నానముచేసి తన ఇంటికివచ్చి శుచితో కృష్ణభగవంతుని పూజసల్పుటకు ప్రారంభింపపోగా వెంటనే గౌరంగస్వామి వాసుదేవుని ఇంటివాకిలి తలుపుతట్టి తలుపు తెరవమనెను. పూజకభ్యంతరమైనదేయని కొంత విసుకుకొని వాసుదేవుఁడు 'ఎవరు వారు'? అని అనెను. స్వామి 'నేను వాసుదేవా! తలుపు తెరువుము' అనెను. కంఠధ్వని ఆనవాలుపట్టి స్వామి యని

యూహించి సంతోషముతో తలుపు తెరచెను. వెంటనే ఒకదివ్యతేజస్సుతో స్వామి వాసుదేవునింటి పూజాగృహమును ప్రవేశించి పూజాపీఠమున కూర్చుండెను. సాక్షాన్నారాయణావతారమైన గౌరంగస్వామి శ్రీకృష్ణరూపముతో తనఇంటికేతెంచు నంతటి భాగ్యము తనకుగలిగెనేయనివాసుదేవుఁడు సంతసించెను. స్వామి 'వాసుదేవా! గంగాజలములను తెచ్చి నాకభిషేకముచేయుము' అనెను. వెంటనే వాసుదేవుఁ డట్లుచేసి, ధూపదీపనైవేద్యములతో స్వామిని తృప్తిపఱచెను. స్వామితో ప్రవేశించిన దివ్యతేజస్సుతోఁగూడ వేణుగాన మొకటి అచ్చటచేరినవారి కందఱికును వినఁబడుచుండెను. ఆదివ్యగానమును వినుటకు జనులు వాసుదేవుని ఇంట గుంపులుగూడిరి. అందఱును గానమును వినుచు పరవశులైరి. అప్పుడు స్వామి నాలుగేండ్ల పసిపిల్ల నొకదానిని పిలచి అమ్మా కృష్ణనామస్మరణ గావింపుమనెను. అందుకా పసికూన 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే' అనుచు గంతులువేయుచు శాస్త్రీయముగ నృత్యము చేయసాగెను. అచ్చటివారందఱు అది భగవంతునికృత్యమని ఆనందించిరి. వాసుదేవుని స్వామిపిలచి తాను

ఈజన్మమున నెవరిని హింసించుటకు జన్మించలేద నియు, క్రూరులను, పాపులను భగవద్భక్తిగలవారిగాఁజేసి, తన్ను పొందుటకు వారికి మార్గము చూపుటయే తనకాజన్మములో కార్యము. గాన బంగాళనవాబు తనభక్తులను తొందఱపెట్టఁజాలఁడని అభయహస్తమిచ్చెను. వాసుదేవుని ఇల్లంతయు కోటిసూర్యప్రభతో నింతసేపు వెలుగుచుండిన కాంతి మాయమాయెను. స్వామి కీచుమని యొక కూతవేసెను. మూర్ఛిల్లెను. అచ్చటనుండిన పరివారము సేవఁదేర్చగా స్మృతివచ్చి భక్తులతో భాగీరథికిఁబోయి, సాయంకృత్యముల నెరవేర్చెను. ఆదినమురాత్రి కూడ వాడుకప్రకారము వాసుదేవుని ఇంట కృష్ణకీర్తన సాగించెను. అదిమొదలు రాత్రివేళేగాక పగలు సైతము బంగాళాయంతయు హరిభజన గావింపఁబడుచుండెను.

గౌరంగస్వామి యమానుషకార్యములను చేయుట.

స్వామివారి దర్శనమైనమాత్రమున వారికటాక్షవీక్షణములు సోకినమాత్రమున నెట్టివారికిగల రోగములుగాని, జనులనావహించియున్న పిశాచాదులుగాని, నివారణమైపోవుచుండును. వాసుదేవునిఇంట నొకనాఁడు గౌరంగస్వామి శ్రీనారాయణమూర్తి కృష్ణావతారమున మధురాపురములోనొలువున్నట్లు

ఒకదినము వాసుదేవుని ఇంట కొలువుగూడెను. దివ్యతేజస్సు గృహము నావరించెను. గౌరంగస్వామి తనదేహమును శ్రీకృష్ణస్వరూపముగ మార్చెను. గదాధరుఁడు స్వామిని పూలహారములచే శృంగారించెను. నిత్యానందుఁడు ఛత్రము పట్టెను. నరహరియనుభక్తుఁడు చామరములు వైచెను. ఈ సంగతి నవద్వీపపట్టణమంతయు విద్యుచ్ఛక్తివలె ప్రసరించెను. జనులు దివ్యకళాస్వరూపమును జూడను ఏతెంచిరి. శ్రీకృష్ణదర్శనమందఱికిని ఆయెను. జనులందఱు సంతసించిరి. ఆనందసముద్రమున నోలలాడిరి స్వామి శత్రువులుసైతము, వేలకొలది స్వామి శిష్యులతో నీభగవల్లీలలో నిమగ్నులైరి. అందఱు నేకగ్రీవముగ గౌరంగస్వామి మానవుఁడు కాఁడు. అవతారస్వరూపుఁడనిరి. ఆబాలగోపాలముగ నాభగవంతుని దివ్యదర్శనము తమకబ్బగా, స్వామిపాదములకు భక్తితో ప్రణమిల్లిరి. కంఠమున పూలమాలికల నర్పించిరి. పురుషసూక్తముల పఠించిరి. కీర్తనలను పాడిరి. సహస్రనామములతో నుతించిరి. తమలో తాము ముచ్చటలాడిరి.

వీరిభక్తులలో నొకరు అద్వైతస్వామియను వా రున్నారు. వీరు గోస్వామియని పేర్కొనఁబడుదురు. శ్రీధరుఁడు, హరిదాసు మొదలగువార లనే

కు లుండిరి. హరిదాసు తూర్పుబంగాళో నుండు మహమ్మదీయుఁడు. గౌరంగస్వామియొక్క విద్వత్తునకు, అమానుష కార్యములకు, భక్తికిని పరవశుఁడై స్వామికి శిష్యుఁడు తానైనదే గాక, యనేకులు మహమ్మదీయులను సైతము శిష్యులనుజేసెను. తన శిష్యులకందఱకును గౌరంగస్వామి శ్రీకృష్ణమూర్తి యవతారస్వరూపమునుజూపి వారివాంఛితములను కోరినచో నొసగెదనని చెప్పెను. భక్తులందఱు నేకగ్రీవముగ భగవంతుని ప్రేమించుట, భగవల్లీలను వినుట, భగవంతునకు భృత్యుఁడగుట, మ్రొక్కుట, పూజించుట, పరిచర్యనుచేయుట, భగవద్విషయమై యాత్మలో నెఱుకఁగలిగియుండుట, భగవంతుని కీర్తించుట, ధ్యానించుట నను నీతొమ్మిది భగవద్భక్తి మార్గోపదేశములు తప్ప తమకేమియును కోరికలు లేవనిరి. వారిలో మురారియను శిష్యుఁడొకఁడుండెను. అతను రామభక్తుఁడు. ఆతనిని అప్పుడు పిలచి, 'ఇదిగో నీఇష్టదైవస్వరూపమును జూడుము' అని గౌరంగస్వామి సీతారాములుగ మారి అయోధ్యయందు శ్రీరామపట్టాభిషేకకాలమున కొలువుకూటమునందు శ్రీ సీతాలక్ష్మణభరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామవిగ్రహమును జూపి యారూపమునే అచ్చటనుండిన యావజ్జన

మునకును కాన్పించెను. కలియుగమున హరినామ సంకీర్తనమే తన్ను పొందుటకు సులభోపాయము అనిన్ని తన్నే భజించవలయుననియు పూర్వము శ్రీ కృష్ణమూర్తి అర్జునునకు విశ్వరూపమును జూపిన కాలములో యుపదేశించిన నాయందే మనస్సునుంచుము. నాయందు బుద్ధిని స్థిరముచేసికొమ్ము. అటులగునేని నీవు నాయందు నివసింతువు. దీనియందు సంశయమేమియు లేదు. 'మయ్యేవమనఆధత్స్వమయిబుద్ధింనివేశయ, నివశిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః.' (గీ. ౧౨. ౮) అను భక్తి మార్గమునే మరల గౌరంగస్వామిరూపముతో నిప్పటికి 420 సంవత్సరములకు పూర్వము బంగాళాలోని భక్తజనులకు స్వామి యుపదేశించెను

మాధవమిశ్ర, జగన్నాధమిశ్రులు అను కొత్వాలులు.

పిదప గౌరంగస్వామి తనకు ప్రియులగు శిష్యులలో నిత్యానందుని, హరిదాసుని వీరినిద్దఱిని పిలచి వారిని నవద్వీపములోనుండు ప్రతిగృహమునకు వెళ్ళి ఇంటివారినందఱను కృష్ణనామస్మరణను జేయుమని తానుచెప్పినట్లు చెప్పమనెను. ఆతీరున వారు ప్రతిఇంటికిపోయి గౌరంగస్వామివారి యాజ్ఞను దెలుపుచుండిరి. వీరిరువురు నొకనాఁడు తమలో నిట్లనుకొనిరి. 'స్వామివారియాజ్ఞ జవదాటగూడదు.

అయితే పట్టణములోని జనులు మూర్ఖులు. వారి యాజ్ఞను చేయరు. బహుకష్టముగానున్నది. ఈ కష్టము తొలగుటకుపాయము ఇప్పట్లో ఊరిబయటి తోటలో విడిసియుండు నవాబు పన్ను వసూలు చేయు మాధవమిశ్రుఁడు జగన్నాథమిశ్రుఁడు వీరిరువురును స్వామివారియాజ్ఞను శిరసావహించునట్లొనర్చిన పట్టణములో నుండువారందఱును వారికి భయపడి వారొనర్చునట్లు తామును చేయుదురు. మనకు కష్టముతొలగు'నని తలచి ఊరిబయటనుండు మాధవజగన్నాథమిశ్రుల విడిదితోటకు పోయి వాకిలితలుపులు మూసియుండగా తట్టి తెరువమనిరి. వెంటనే లోపలనుండి మాధవమిశ్రుఁడు వచ్చి తలుపు తెరచి ఏమిపనిమీఁద వచ్చితిరని నిత్యానందుని హరిదాసుని యడిగెను. వీరిరువురును గౌరంగస్వామివారు వారిని కృష్ణస్మరణచేయుమని తమగుండా చెప్పిపంపినారనియు, నాయాజ్ఞమేరకాసందేశమును జెప్పవచ్చితిమనియు నుడివిరి. మాధవ, జగన్నాథమిశ్రు లిరువురును శాక్తేయులు. ఆపేరుఁబెట్టి రాత్రికాలములో నొక్కొక్కప్పుడు మద్యపానము, మాంసభక్షణము చేయు క్రూరచిత్తులు. వీరు పన్నువసూలుచేయునధికారము నబాబుయొద్దనుండి గైకొని ఆకార్యాచరణమున చేసిన ఘోర

మైన స్త్రీహత్యలు, శిశుహత్యలు లెక్కలేక చేసినారు. వీరికీవార్త కఠోరమై నిత్యానందుని, హరిదాసుని తరిమికొట్టుటకు యత్నించిరి. ఎట్టకేలకు వారాప్రదేశమును వీడి మృత్యుప్రముఖమునుండి తప్పినవారిమైతిమని గడగడవడకుచు ఎగరోజుదిగరోజులతో గౌరంగస్వామివారియొద్దకువచ్చి వారితో యావద్వృత్తాంతమునునివేదించిరి. వెంటనే స్వామివారు భజనచేయు శిష్యులందఱకును సందేశమునంపెను. అందఱును గూడిరి. అందఱును భజనలనుజేయుచు కొత్త్వాలులుండుతోటను దరియుచు బోయిరి. ఈసందడి ఏమని సేవకులను మాధవజగన్నాథమిశ్రులు అడిగిరి. అది వైష్ణవులభక్తి ఆవేశమనిరి. సేవకులు ఇట్లుండ భజన అప్పటికప్పటికి తమ విడిదితోటలోనికేవచ్చుటను మాధవమిశ్రుఁడు గమనించి వెంటనే పరువిడి భజనసేయువారలలో నంతకుముందు తమయొద్దకువచ్చిన నిత్యానందుని, హరిదాసుని గుర్తించి కోపోద్దీపితచిత్తుఁడై నిత్యానందుని తలపగులునట్లు గొట్టెను. దాని ఫలముగ నెత్తురుగార నారంభించెను. నిత్యానందుఁడు మూర్ఛిల్లెను. గౌరంగస్వామి మూర్ఛిల్లిన నిత్యానందుని గాయమునుకట్టుగట్టి సేదదీర్చి మాధవమిశ్రుని యొద్దకుఁబోయి నీవేల నిత్యానందుని అట్లుగొట్టితి

వని యడిగెను. అందుకు మాధవ మిశ్రుఁడు, 'ఈతఁడు ఇంతకుమునుపు మాబసకు వచ్చి మమ్మును హరినామస్మరణ కృష్ణభజన గావింపమన్న తప్పునకై కొట్టుటకు మాబస వెలుపలివరకు తరుముకొని వచ్చినను అప్పుడు ఈతఁడు తప్పించుకొనెను. మరల మీతోఁ జేరి రాగా నెత్తిఁ బగులఁగొట్టితి' ననెను. 'కృష్ణస్మరణచేయమన్న తప్పుకై వానితలపగులఁ గొట్టితిరే! అనేకస్త్రీలను, శిశువులను హత్యలు గావించి దేశములో వారిద్రవ్యాపహరణమును చేసి యుండు నీపాపములు పర్వతాకారములై నీనెత్తిన వ్రాసియున్నవే, అట్టి నీకేలాటి శిక్షలను విధింప వలసియుండును?' అని స్వామి యడిగెను. వెంటనే మాధవమిశ్రుని శిక్షించుటకై చక్రమును ధ్యానించెను. ఇది తెలిసి నిత్యానందుఁడు స్వామితో, 'స్వామీ! ఈజన్మమున ఎట్టివానినిశిక్షింపను. ఎంత పాపాత్ముడైనను భక్తికి లొంగదీసి భగవద్భక్తునిగఁ జేసెదనంటిరే. చక్రాయుధమేల? మాధవునిమన్నింపుము.' అనెను. ఇంతలోపల మాధవజగన్నాథ మిశ్రులను అగ్నిహోత్రమువంటి తేజస్సొకటి ఆవరించెను. అందులకు వారిరువురును దిగులొందిరి. జగన్నాథుఁడు గౌరంగస్వామి కాళ్లమీఁదఁబడి తమ్మును కాపాడమనెను. అందుకు స్వామి, జగ

న్నాథునితో, 'నీవు మాధవునంత పాపాత్ముఁడవు కావు. నిన్ను మన్నించెదను. లెమ్ము. కృష్ణభజన సేయుము. అదియే నీపాపముల రాచును.' అనిచెప్పి అచ్చటనుండి భజనచేయుశిష్యులతో మరలెను. మాధవజగన్నాథులను జూచి యావజ్జనులు గడగడ వడంకువారు. అట్టివారలిరువురును గౌరంగస్వామి పాదాక్రాంతులగుటకు జనులచ్చెరువుపడి స్వామి వారిమహిమను కొనియాడిరి. మాధవుఁ డారాత్రి నిదురపోలేదు. తానుజేసిన పాపములన్నియు రూపు దాల్చి తన్ను హింసించుచున్నదో అనునట్లు యా రాత్రి అతివేదనలనొంది గంగాతీరమున మరునా డుదయమునందు జపించుచుండిన గౌరంగస్వామి పాదములమీఁదపడి ఎట్టకేలకు తన్నురక్షించుమని పరిపరి రోదనముచేసెను. అంత స్వామి తనకపరాధ మును గావించినవాఁ డెట్టివాఁడైనను తాను మన్నింతుననియు, తనభక్తునకు అపరాధమును గావించిన వాని నేనాడును మన్నింపననియు, తనభక్తునిపాద ములఁబడి శరణువేఁడినచో భక్తునికోరికను తప్ప మాధవునికోర్కెను తీర్చుననెను. వెంటనే మాధవుఁడు నిత్యానందుని శరణుజొచ్చెను. నిత్యానందుఁడు మాధవునకు అభయదానమిచ్చి స్వామిని మాధవునిరక్షించుటకై ప్రార్థించగా మాధవుని

యనంత పాపపరిహారార్థమై మాధవుని గంగాస్నానము చేయించి వానిచేతిగుండా తానొక తాంబూలదానమును స్వీకరించెను. నిమ్మపండువంటి స్వామి శరీరము ఆదానపరిగ్రహముచే కొంతసేపు నల్లనిదాయెను. అచ్చటి ప్రజలందఱును దానికాశ్చర్యముబొందిరి. గౌరంగస్వామి మహిమను కొనియాడిరి. మాధవుఁడు తనపాపములను హరింపఁజేసికొని కృష్ణస్మరణచేయుచు స్వామి శిష్యులలో నొకఁడయ్యెను.

గౌరంగస్వామి, కాజీ.

ఇట్లు మహాదుష్టులను స్వామి భగవద్భక్తిగలిగించి దేశమంతయును కృష్ణసంకీర్తనమునకు బురికొల్పుచుండెను. ఎక్కడచూచినను కృష్ణనామ సంకీర్తనమే భగవత్కాలక్షేపమే భజనలు రేయింబవళ్లును ప్రబలిపోయినవి. కొందఱు గౌరంగస్వామి భక్తుల ఈభజనలఘోష అధికమై పోవుటను అధికారులకు చెప్పి ఈరచ్చను నిలుపుదలచేయుటకు యత్నించిరి. అప్పుడాదేశము నొకమహమ్మదీయ కాజీచే పాలింపఁబడుచుండెను. కాజీతో ఈఘోషను నిలుపుదల చేయమని ఫిర్యాదు చేసిరి. అంతట కాజీ ఏ ఇంటను కృష్ణసంకీర్తనము చేయకూడదు. భజనలు చేయరాదని పట్టణమంతయు చాటించెను. సైన్యమును

తెచ్చి పట్టణమున నెలకొల్పి భజనల నాపుటకుత్తరవుచేసెను. కొందఱు భజనలు నిలిపిరి. కొందఱు స్వామియొద్దకుపోయి భజనలు సేయుటకు నిర్బంధము తటస్థించినందున గ్రామాంతరమునకై పోయి భజనలు సేయుచు కాలమును వెళ్లబుచ్చెదమనిరి. అందుకుస్వామి, "అట్లువలదు. ఈరాత్రి నాశిష్యులు భక్తులు ఒక్కొక్క రొక్కొక్కదివిటీని చేతఁ బూనుకొని అందఱు వాసుదేవుని ఇంటియందుండి తర్లి పట్టణమంతయు భజనచేయుచు నూరేగుదము. దానికై సన్నాహములు చేయవలసినది" అనెను. ఈవార్త పట్టణమంతయు వెల్లడియయ్యెను. రాత్రి స్వామి భజనసేయుచు నూరేగుదునని వాకిళ్లల్లో పుణ్యాంగనలు కలువడములు జల్లిరి. ముగ్గులుతీర్చిరి తోరణములుకట్టిరి. పట్టణమంతయు నొకపెట్టున నలంకరింపఁబడెను. ఈవేడుకను చూచుటకు పల్లెలయందుండి జనులు గుంపులు గుంపులుగా గూడిరి. నవద్వీపమంతయు నమితోత్సాహ పూరితముగ గనుపట్టెను. సాయంసమయ మాయెను. అందఱును వాసుదేవునింటివాకిటఁ జేరిరి. స్వామిని శృంగారించిరి. భక్తులనేకులు చేరినందువల్లన వారిని నాలుగు తండాలుగ విభజించి ఒకతండాకు నిత్యానందుఁడు, ఒకతెగకు హరిదాసు, మూడవదానికి

గదాధరుఁడు, అన్నిటికి ముందునడచు తెగకు తాను
నిలిచి హరికీర్తనప్రారంభించి, మైమఱచి నృత్యము
సేయుచు భక్తులనుజూచి శ్రీకృష్ణుని వెతకుచు
బోవుచున్నారా? ఆకృష్ణుఁడను, పరమాత్మను, నిమిని
అంతయునేనే. మానవజాతి నుద్ధరించుటకు లోక
మున నిట్లవతరించియున్నాను. అనిచెప్పుచు హరి
నామ సంకీర్తనము చేయుచు కాజీదిగియుండు
తోటవైపుకు ప్రజను హరిభజనలతో సాగించుచు
కొంపోవుచుండెను. గంగకు ఆవలియొడ్డున నొక
తోటలో కాజీదిగియుండెను. కాజీ తనమేడమీఁద
ఆరాత్రినిలుచుండి షికారుచేయుచుండెను. ఒక
గొప్పధ్వనితో పట్టణమంతయు కోలాహలముగ
దేదీప్యమానమై యుండుటనుగాంచెను. అదియొక
ధనికునిఇంటి పెండ్లియూరేగింపు అని తలచెను.
కొంతసేపటికి భటులనుపిలిచి యాకోలాహల మే
మని తెసిలికొనిరండని యాజ్ఞాపించెను. వారును
పోయి ఆగుంపులోచేరి యాయుత్సవమున మైమ
ఱచి హరిభజనలయందు పాల్గొనిరి. కొందఱు జను
లు ఇంతకున్న కాజీకారణము. వానినిఈదినము తుద
ముట్టించవలయునని ఎంచి చెట్లకొమ్మలను విరిచి
మండెలనుగైకొని కాజీని పట్టుడు,కొట్టుడు, తిట్టుడు
అనుచు కేకల నారంభించిరి. ఇదివిని గౌరంగస్వా

మివారు మనము ఎవరిని హింసింపరాదు. ఈపిచ్చి
చేష్టలను మానుఁడనెను. ఇంతలోపుగా భజనలతో
గుంపు కాజీతోటను దరిసెను కాజీకి, 'మార్
కాజీ' యనుమాటల వినఁబడుటచే తన కేమైన నపా
యము కలుగునేమోయని సందేహించి సైనికు
లను పిలువగా అప్పటికి రాత్రి 9-గంటలేయైనను
ఎవరున్ను విన్నవారుగారు. కాజీదిగులొంది అంతః
పురస్త్రీలనడుమ దాగుకొనెను. తలుపులను భద్ర
ముగమూసి గడియవేసికొనెను. ఈలోపుగా కృష్ణ
నామసంకీర్తనముతో నిమిపండితుఁడు కాజీఇంటి
వాకిట విడిసెను. కాజీకి ఆంతర్యముగు కొందఱిని
ఉద్యోగస్థులు భజనసమూహము నందుండగా
వారిని పిలిచి 'కాజీకివచ్చినహాని యేమియునులేదు.
ఆతనిని గౌరంగస్వామి పిలుచుచున్నాఁడు' అనిచెప్పి
తోడ్కొనిరమ్మని యాజ్ఞాపించెను. వారు కాజీ
చెంతచేరి స్వామియొక్క సద్భావమును విన్న
వించిరి. కాజీ భయమువీడి స్వామి ఎదుట బ
డెను. స్వామివారి మాతామహుఁడు నీలాంబర
మిశ్రులనువారు కాజీకి పరమమిత్రులు. ఆవరుస
ననుకరించి కాజీని స్వామివారు మా, 'మామా!
అల్లుఁడు ఇంటికి ఊరేగింపుతోరాగా నీవు భయ
పడి దాగియుండుట తగునా, నన్నేల గౌరవించవు?

నాయొనర్చిన అపరాధమేమి?' అని యడిగెను. అల్లుని సౌజన్యమును గుర్తించి అపాయము లేదని తలచి తనయపరాధము నొప్పుకొని స్వామివారి అనుచరులు కొందఱు 'మార్ కాజీ' యని కేకలువైచుచు, తన ఇంటితట్టు వచ్చుచుండగా అట్లని మహిమను తెలియనివాఁడై పామరుఁడనై ఇంట దాగికొంటిని నాక్రిందియధికారులు భజనల నాపమని తొందరచేయగా వానిని నావునట్లు దండోరా వేయించితినేగాని మరేమియు లేదు. అనుచు స్వామి దర్శనమాత్రమున కాజీమనోకాఠిన్యముతగ్గి కృపాతరంగితహృదయముతో భక్తిపరవశుఁడై కన్నీరుకార్చుచు తన్నుద్ధరించమని, కాపాడమని స్వామి పాదములపైఁబడి వేడుకొనెను. అందుకు స్వామి చిఱునవ్వు నవ్వెను. కాజీ స్వామితో మాట్లాడుచుండినపుడు ఇట్లని చెప్పియుండెను. "హరికీర్తనగావించుట, స్వామివారిభక్తులవాక్కున కృష్ణనామము నాటియుండుట ఇవన్నియును ఆలోచించిచూడగా నీహరినామ సంకీర్తన భగవదాజ్ఞానుసారముగ నడుచుచున్నదని నామనసునకు స్పష్టముగా గోచరించినది." ఈసంభాషణలో కాజీ హరి,కృష్ణనామముల నుచ్చరించెను. స్వామివారు దానిని గమనించి యుండినందున తన్ను కాపాడమని దీనుఁడై వేడు

చున్న కాజీతో "నీనోట హరి, కృష్ణ అనునామములుచ్చరింపఁబడినవి. కావున నీపాపములు తొలగినవి భయపడకుము. ఇకమీదట హరికీర్తన నుచ్చరించుటకు పట్టణమున అరికట్టకుము." అనెను. కాజీకి అందులకు మితిమీరినసంతోషము కలిగెను. కంట ఆనందబాష్పములు పొడమెను. స్వామితో, "నీవు లోకారాధ్యుఁడవు నేను పాపాత్ముఁడను నన్ను రక్షించి, నాకు తరణోపాయమును, మోక్షమును ఇమ్ము" అనెను. 'కృష్ణనామస్మరణ, హరిసంకీర్తనము, నిన్ను కాపాడును. హరిభక్తులభజనల నాపకుము. నీకుసంసారనివృత్తియే మోక్షముగల్గు'ననెను స్వామి. అందుకు కాజీ స్వామిముందట చేమోడ్పుతో తానట్టికార్యములు చేయననియు,హరికీర్తనను పోషింతుననియు తనవంశస్థులందఱును హరికీర్తనను పోషించునట్లు చట్టము గావింతుననియు చెప్పెను. అంతట గౌరంగస్వామి మరల భక్తులను భజనగావించుటకు సెలవిచ్చెను. స్వామిన్ని వేలకొలది జనులును భజనలతో వాసుదేవునింటికి మరలిరి. కాజీ స్వామివెంట కొంతదూరము దారినంపవచ్చి స్వామి సెలవు గైకొని తనవిడిదికి పోయెను.

ఈసంగతి జనులెల్లరును కన్నవారైనందున స్వామిమహిమను కాజీ వినయపరుడగుటను అత్యా

శ్చర్యపడిరి. ఇంతకున్ను కారకులగు కొందఱు స్వామి శత్రువులు పశ్చాత్తాపపడి స్వామి శరణుఁజొచ్చిరి. ఇప్పటికిని ఆకాజీసమాధిని శ్రీవైష్ణవభక్తులనేకులు యాత్రార్థులై పోవువారు దర్శింతురు. కాజీయున్నంతవరకు హరిసేవారతుఁడై కృష్ణనామసంకీర్తనలతో కాలముగడపి మోక్షమును పొందెనని యాప్రాంతముల నిప్పటికిని కాజీని శ్లాఘించెదరు.

ఇట్లు భక్తులపరాధీనుఁడైన శ్రీకృష్ణచైతన్యస్వామి అనేకులకు భక్తిమార్గోపదేశంబుఁగావించి తరణోపాయమునుఁజూపి ఆకాలమునందు విస్తారముగ ప్రబలియుండు ఇంద్రియలోలత్వము అభివృద్ధిగానీయక దానికి కొంతవరకు గొప్పచెలియలికట్టగ స్వామియొక్క నడవడి ఏర్పడెను.

వాసుదేవుని కుమారుని మరణము.

వాడుకచొప్పున వాసుదేవునిఇంట గౌరంగస్వామి హరినామసంకీర్తన గావించుచుండ వాసుదేవుని కుమారుఁడు మృతినొందెను. వాసుదేవుఁడు తనభార్యకును ఇంటనున్నవారికిని స్వామికీర్తన ముగియువరకు రోదనధ్వని వినకూడదని కట్టుదిట్టములు చేసియుండెను. కొంతకాలము రాత్రి భజన గావించి స్వామి భజననునిలిపి 'వాసుదేవా! ఈదినము భజన అంతరంజింపలేదు. మనస్సు చలించు

చున్నది. కారణమేమో యూహింప శక్యము గాకయున్నది. నీకేమైన అపాయము కలిగియుండవలెను' అనెను. అంతట వాసుదేవుఁడు స్వామివారి కృపాకటాక్షము తనపై ప్రసరింపుచుండువరకు తనకు అపాయమేమియు లేదనెను. ఇంతలో అద్వైతస్వామి 'వాసుదేవునికుమారుఁడుమరణించె'ననెను. అప్పుడు ఆశ్చర్యపడి 'ఎప్పుడు మరణించెను? ఎంతసేపాయె'ననగా నందులకు అద్వైతస్వామి 'ఏడెనిమిదిగంటల వ్యవధియాయె'ననెను. స్వామి వాసుదేవుని ముఖము నిశ్చలమై చింతలేకయుండుటనుఁజూచి, ఇట్టి భక్తులే పరమాత్మను బొందుదురు. దారాపుత్త్రాదులు అద్దములోని ప్రతిబింబమువంటివారు. మాయావిరహితుఁడగు జీవికే పరమాత్మానుసంధానము కలుగును. ఇట్టి భక్తుల జీవములు నన్ను వదలుచున్నవి! అని కన్నీరు స్వామి పెట్టుకొనెను. వాసుదేవుఁడు స్వామితో, 'మీవంటి మహానుభావులు భజన మాఇంటచేయుచుండ ఆకాలమున జీవమును వదలిన ఆచిన్నవాని భాగ్యమే సౌభాగ్యము'. అనెను అందుకుస్వామి, 'నీవునిశ్చయముగ అరిషడ్వర్గములను జయించినవాఁడవు. నిజమైనకృష్ణభక్తుఁడవు. కృష్ణభక్తులకు వ్యసన మెన్నడును లేదు. పుత్త్రశోకమువంటి గొప్పవ్యసనము నిన్నంటలేదు.'

అనిచెప్పి వాసుదేవునిభార్యతో చనిపోయినబిడ్డను తనయొద్దకు పట్టుకొని రమ్మనెను. ఆశవమును స్వామి చూచిమాటలాడమనెను. ఆశవము, "స్వామీ! నేను మేలైన లోకములకు పోవుచున్నాను. నాయాత్మ మీపాదసేవానురక్తమై యున్నది. నాయందు కటాక్షించి మరల ఈపాపపులోకమునకు రమ్మని యాజ్ఞాపింపకుఁడు." అనెను.

అచ్చట గుంపులుగుంపులుగ గుమిగూడినవారు స్వామివారి అమానుషమగు నామహిమకు ఆశ్చర్యముపోయిరి. భక్తులకు, సిద్ధులకు అశక్యమైన దేదియు లేదు. అనుట కింతకంటె నిదర్శనములు వేరుకావలయునా? వాసుదేవుఁడును అతనిభార్యయు మంచిలోకములకు పుత్రుఁడుపోయెనని దుఃఖము లేక సంతోషించిరి.

గౌరంగిస్వామి సన్న్యసించుట.

విరాగుల కత్యంతశ్రేయస్కరమైనది సన్న్యాసాశ్రమము. ఇంతవరకు బ్రహ్మచర్యము కొన్నినాళ్లు గార్హస్థ్యము కొన్నినాళ్లు చరించి, తురీయాశ్రమము నందు స్వీకారము ఇచ్ఛపొడమినది గౌరంగస్వామి వారికి. ఇట్టిగొప్పభక్తునకు ఇచ్ఛపొడమగానే దానిని గురుముఖముగా స్వీకరించవలయునని అందుకై వీరిని, వీరియొక్క విద్వత్తును, వీరినడవడికయు, వీరి

భక్తిపారవశ్యతను నెఱింగినస్వామివారొకరు ఈశ్వరపురియనువా రుండిరి. గౌరంగస్వామి చరిత్ర యంతయును ఈశ్వరపురి యెఱుంగుదురు. సన్న్యాసము నపేక్షించి గౌరంగస్వామి తనయొద్దకేగగానే వారే యాక్షేపణమును చెప్పక వీరికిసన్న్యాసము నిచ్చిరి. శ్రీకృష్ణచైతన్యస్వామి యని పేరు బెట్టిరి. ఇప్పటికి వీరివయస్సు ముప్పదిరెండు. వీరి తల్లి శచీదేవి. ఇంకను బ్రతికియున్నది తల్లియనుజ్ఞ నొంది సన్న్యసించెను. ఆమెయాజ్ఞ వడసి జగన్నాథక్షేత్రమున శిష్యులతో నివసింపఁబోయెను.

స్వామి జగన్నాథక్షేత్రమునకుఁ బోవుట.

తోటిశిష్యులతోను, భక్తులతోను స్వామి జగన్నాథమున ప్రవేశించుచుండగనే జగన్నాథస్వామి యాలయపు గోపురముపై నుండి శ్రీకృష్ణమూర్తి ప్రత్యక్షుఁడై స్వామివారిని రెండుచేతులు చాచి రమ్మని పిలచినట్లు అందఱకును దృశ్యమాయెను. అపుడు స్వామియు వారియనుచరులును నృత్యము చేయుచు హరినామసంకీర్తనము గావించుచు 'ధాధేశాకృష్ణజయ' యను జయజయధ్వనులతో జగన్నాథాలయమును ప్రవేశించిరి. ఆదేవస్థానమున మహావిద్వాంసుఁ డొకఁడు వాసుదేవసార్వభౌముఁ డనుపేరుగలవాఁ డుండెను. ఈతఁడు న్యాయశాస్త్ర

పండితుఁడు. ఓఢ్రదేశ రాజసంస్థానవిద్వాంసుఁడు. అమాత్యుఁడు, వేదవేదాంగములయందును తర్కశాస్త్రమునందును గొప్పపాండిత్యమును కాశిలో గడించినవాఁడు. దక్షిణదేశంబున నీతనిమించిన విద్వాంసుఁడు లేఁడనిపించుకొనినవాఁడు. ఈతఁడు అద్వైతి. ఆకాలమున అద్వైతశాస్త్రమునం దసమానుఁడును, విద్వాంసులకెల్లతలకట్టైనవాఁడును, సన్న్యాసియునైన ప్రకాశానందస్వామి శిష్యుండు ఈవాసుదేవసార్వభౌముఁడు. ప్రకాశానందస్వామి కాశీవాసి. భక్తియనునది ఎట్టిదో నెఱుంగఁడు. గురువు ఎట్టివాఁడో శిష్యుఁడైన వాసుదేవసార్వభౌముఁడును అట్టివాఁడే. గౌరంగస్వామిహరినామసంకీర్తనచేయుచు జగన్నాథాలయమును ప్రవేశించగానే కొంతసేపటికిమూర్ఛఁజెందెను అప్పుడచ్చట నుండిన వాసుదేవపండితుఁడు స్వామిని లేవనెత్తి కూర్చుండఁబెట్టి ఉపచారములను గావించి సేదఁదేర్చెను. అప్పుడు వాసుదేవపండితునకు సమీపబంధువు ఒకఁడు గోపీనాథులనువారు స్వామిసంగతిని బాగుగనెఱింగియుండి వాసుదేవపండితునితో గౌరంగస్వామి చరిత్రనంతయు విశదీకరించెను. వాసుదేవపండితుఁడును స్వామికి స్మృతికలుగగానే జగన్నాథస్వామి దర్శనము గావించి వారిశిష్యులు

సహా తమఇంటికి గొంపోయి మధురాహారముల నిప్పించి తుష్టినొందించెను. గౌరంగస్వామి మోక్షమునకు భక్తియే ప్రధానమార్గమని ఎన్నుచు దానినే శిష్యులకు సదా బోధించువారు. వాసుదేవసార్వభౌముఁడు విద్వచ్ఛిఖామణియయ్యును అతనికి భక్తిమార్గము వచ్చినదే కాదు.

వాసుదేవసార్వభౌముఁడు గౌరంగస్వాములవారికి సూత్రభాష్యము నుపదేశించుట.

ఇట్లు జగన్నాథములో గౌరంగస్వామి ప్రతినిత్యము కృష్ణగానముచేయుచుండగా నొకదినము పండితుఁడు స్వామిని చూచి తాము సూత్రభాష్యశాంతియొనర్చితిరా యనెను. స్వామి లేదనెను. అయితే సన్న్యాసాశ్రమమును గైకొన్నవారు తప్పక సూత్రభాష్యశాంతి జేయవలయును. నేను మీకు భాష్యమును చెప్పెదననెను. స్వామి వల్లెయనిరి. నిత్యము జగన్నాథాలయమున బ్రహ్మసూత్రములకు వాసుదేవపండితుఁ డర్థమును స్వామివారికి బోధించుటకై నిత్యము కొంతసేపు ప్రసంగమును ఆరంభించెను. స్వామివారు బహుఓర్పుతో వినుచుండ పదిరోజులు గడచినవి. బ్రహ్మసూత్రభాష్యార్థము దేవాలయములో జరుగుచుండు దానిని వినుటకు అనేకులు విద్వాంసులు, బ్రాహ్మణు

లును నిత్యము వచ్చుచుండిరి. ఒకదినము తనయుపదేశమును స్వామివారు బాగుగ గ్రహించగలిగిరో లేదోయని స్వామివారిని అంతయు బోధయైనదా? ఏమైనను సందేహములున్న దెలుపుమనిరి. అందుకు స్వామివారు పండితునకు సందేహములుగానుండిన విషయముల నడిగెను. అందుకు సరియైన సమాధానము పండితుఁడు చెప్పలేకపోయి తనబంధువు గోపీనాథులు వీరివిద్వత్తును గుఱించి చెప్పినది వాస్తవమని ఎన్నెను. పండితుఁడు స్వామివల్ల ఓడెనని అచ్చటివారెన్నిరి. ఆదినము సాయంత్రము స్వామివారు జగన్నాథాలయములో నిత్యరీతిగ కృష్ణస్తుతి చేయుచుండఁగా వాసుదేవపండితుఁడు అచ్చోటికిపోయెను. అప్పుడు స్వామిదేహమునుండి దివ్యతేజస్సొకటి వెలువడెను. ఆతేజస్సు కోటిసూర్యప్రభతో వెలింగెను. ఆసమయమున గౌరంగస్వామి షడ్బాహువులతో నృత్యముసేయుచు షడ్బాహుస్వరూపుఁడై వాసుదేవ సార్వభౌమ భట్టాచార్యునకు దర్శనమిచ్చెను ఆసమయమున రెండుచేతులలో ధనుర్బాణములును, (ఇది రామావతార ద్యోతకము) రెండుచేతులలో మురళీగానము. (ఇది కృష్ణావతారద్యోతకము) రెండుచేతులలో దండకమండలములు, (ఇది గౌరంగస్వామి

అవతారము) వీనితో నగుపడెను. ఈస్వరూపము జగన్నాథాలయములో 24-గంటల కాలముండెను. భగవంతుని ప్రత్యక్షరూపమును జగన్నాథక్షేత్రమున నుండువారేగాక చుట్టుప్రక్కల దేశాంతరమునందుండి స్త్రీలు, పురుషులు అనేకులువచ్చి స్వామివారి దర్శనమునుగనిరి. ఈషడ్బాహు స్వరూపమునుఁజూడగానే వాసుదేవసార్వభౌమునకు భక్తిగలిగి తాను చైతన్యస్వామి శరణుఁజొచ్చెను. తనకు విద్యాధనములు రెండునుండియు భక్తిలేక తనయుత్తమజన్మమును వ్యర్థపరచితినని స్వామివారిపాదములపైఁబడి చింతించుచు, స్వామిమూర్ఛిల్లగా అనేక ఉపచారములనుఁ జేయుచు తనఇంటికి పిలుచుకొని పోయి నాటిమొదలు స్వామికి అంతరంగభక్తుఁడై నిత్యానందుఁడు మొదలైనవారిజతలో వాసుదేవసార్వభౌముఁడును గూడ చేరి కృష్ణకీర్తన గావించుచుండెను. జగన్నాథమునకు సమీపముననుండు అరణ్యమునందు క్రూరమృగములు సైతము స్వామివారు భక్తిపారవశ్యముచే నృత్యముఁ జేయుటను గాంచుటకు వచ్చుచుండును. అవియును గౌరంగస్వామివారివలెనే నృత్యమును గావించును. అధికవ్యాధిచే బాధపడుచుండిన కుక్కకు స్వామిమోక్ష మిప్పించిరి.

ఇట్లు కొంతకాలము ఓఢ్రదేశమున నుండ
ఆదేశపురాజు ఆకాలమున ప్రతాపరుద్రుఁడను
వాఁడు స్వామియొక్క పాండిత్యమును భక్తిపారవ
శ్యమును విని స్వామివారికి శిష్యుఁడాయెను.
అచ్చటినుంచి స్వామి బయలువెడలి రామేశ్వర
మునకుపోయి సేతుమాధవుని దర్శించి ధనుష్కోటి,
నవపాషాణము, దర్భశయనములను గాంచెను.

దొంగలనాయకుఁడు భక్తుఁడగుట.

ఈయాత్రకు తర్లిపోవుచుండఁగా దారిలో నాకా
లమున తంజావూరికి సమీపమున నొకఘోరార
ణ్యముండెను. ఆయరణ్యమున కొందఱు దొంగలను
జేర్చుకొని యొకక్రూరచిత్తుఁడు ఆదారియందు వచ్చు
వారిని దోచుకొనుచు, ఎదురుతిరిగినవారిని హత్యలు
గావించుచు దొంగలనాయకుఁ డొకఁడుండెను.
వాని పరిజనములయొక్కయు, వానియొక్కయు
క్రూరచేష్టలకు దుర్మార్గప్రవర్తనలకు వెఱచి ఎవరును
ఆయరణ్యమును సమీపింప వెఱతురు. స్వామిని
ఆదేశపు జనులు ఆయరణ్యమార్గముగుండా పోవల
దని నివారించిరి. స్వామివారిపరిజనమునకై తము పోవు
టకు భీతిల్లినది. స్వామివారు వారినందఱను ఒక
చోటవిడియించి తాను మాత్రము ఆఘోరారణ్య
మున ప్రవేశించి అచ్చటనున్న ఒకగొప్పవృక్షము

క్రింద విడిసెను. దీనిని తెలిసికొని దొంగలు కొం
దఱు పోయి తమనాయకునితో చెప్పిరి. ఆనాయ
కుఁడు రౌద్రరూపముతో 'నాయరణ్యప్రదేశమున
సన్న్యాసుల కేమిపని? ఆసన్న్యాసిని పెడఱెక్కలు
విఱిచికట్టి నాయొద్దకు గొనితెండు' అనెను. వారు
స్వామియొద్దకు వచ్చి తమనాయకుఁడు స్వామిని
తనువెంట పిలుచుకొని వచ్చునట్లు ఆజ్ఞాపించెననిరి.
అందులకు స్వామి, 'మీనాయకుఁడు పరమభాగవ
తోత్తముఁడు భగవద్భక్తిగలవాఁడనియే నేనాతని
ప్రదేశమైన ఈఘోరారణ్యమునకు ఆతనినిచూచి
పోవలయునని వచ్చితిని. ఆతనినే నాయొద్దకు పిలచు
కొనిరండు' అనెను. ఈమాటలు దొంగలనాయకుఁడు
తెలిసికొని మిక్కిలిరౌద్రముతో నన్నురమ్మని యా
జ్ఞాపించునంతటి వాఁడొకడున్నాఁడాయని తొక
త్రొక్కినపామువలె చిరచిరలాడుచు స్వామియొద్దకు
వచ్చి 'ఎవరునీవు? నాప్రదేశములో నాకాజ్ఞల నొసఁ
గువాఁడు' అనెను. అందులకు స్వామి, 'నీవు భక్తుఁ
డవు. నీయొద్ద భక్తియున్నది కావున నీదర్శనార్థమై
నేనిచటికివచ్చితిని. ఇచ్చటినుంచిరాలేక నిన్నురమ్మని
చెప్పిపంపితి' ననెను. అందులకు దొంగలమిండడు
స్వామిదర్శనముకాగానే మనస్సు చలించినవాఁడై
'స్వామీ! అనేకహత్యల గావించియున్నాను. నా
పాపములరాచుపెట్లని యడుగగా కృష్ణభజన నీపా

పవులరాచును. అని అతనికి కృష్ణనామస్మరణము నుపదేశించెను వెంటనే స్వామి దేహమునుండి దివ్య తేజస్సువెడలెను. స్వామిమూర్ఛిల్లెను. కొంతసేపునకు దొంగలనాయకుఁడు స్వామికి ఉపచారములు చేసినపిదప స్వామికి స్మృతివచ్చెను. దొంగలనాయకుఁడు తనసర్వస్వమును వదలి స్వామికి శిష్యుఁడై స్వామివెంట బయలువెడలెను.

స్వామివారు, విజయనగర ప్రభువులు రామానందరాయుఁడు.

గౌరంగస్వామి క్రూరమృగములను, క్రూరచిత్తులను, అల్పమృగములను, అల్పమానవులను, మహాపండితులను, మూఢులను, అందఱను కృష్ణభజనలచే భక్తిమార్గమునకు ద్రిప్పుచు తుంగభద్రాతీరము దరిసెను. ఆనదిలో నిత్యము ఉదయకాలమున స్నానముచేసి తనయనుచరులతో హరినామస్మరణ, కృష్ణకీర్తనమును గావించుచుండెను. ఆదేశస్థులందఱును అచ్చటికి యాత్రార్థమై వచ్చి విదేశస్థులును వేలకొలది తేరుతిరునాళ్లవలె స్వామివారి నృత్యములను నిత్యము చూచుటకు వచ్చి సంతోషించుచుండిరి. తుంగభద్రాతీరమున ఆకాలమున విజయనగర రాజ్యమును రామానందరాయుఁడనువాఁడుపాలించుచుండెను. అతనుకృష్ణభక్తుఁడు. ఎవరోసన్న్యాసి తనరాజ్యమున కృష్ణసంకీర్తనముచేసి అనేకవిధనృ

త్యములతో భగవద్భక్తిని వెలిబుచ్చుచున్నారనుటను దెలిసి రామానందరాయుఁడనుమహీపాలుఁడు అచటికి వచ్చి స్వామికి మ్రొక్కి దీవనలంది ప్రియశిష్యుఁడాయెను. రామానందరాయుఁడు కృష్ణభక్తుఁడు. స్వామితో కృష్ణభక్తిని గుఱించి మాటలాడుచుండ స్వామివారు ఎటువంటిభక్తి మిక్కిలి విశేషమైనదని ప్రభువును ప్రశ్నచేసెను. అందుకు ప్రభువు ప్రేమభక్తియే విశేషము. 'యోషాజారమివప్రియా' యవ్వనస్త్రీ జారపురుషునియందుంచునట్టి ప్రేమయే అధికప్రేమయనియు అట్టిప్రేమను రాధ, కృష్ణమూర్తియందుఁ జూపించెననియు అదియే ప్రేమభక్తియనియు రాజుచెప్పఁగా అచ్చటనుండు స్వామివారిశిష్యులందఱు 'రాధేశా కృష్ణ జయ' అను జయజయధ్వానములగావించిరి. స్వామి మైమఱచి నృత్యము చేయసాగెను. అపుడు స్వామి దేహమునుండి ఒకదివ్య తేజస్సు కనఁబడెను. ఆతేజస్సు మధ్యను స్వామివారు కనఁబడకపోయిరి. వారిస్థానమున రాధాకృష్ణస్వరూపము అందఱకును కానిపించెను. కొంతసేపునకు రాధాకృష్ణస్వరూపమదృశ్యమై యథారీతిగ స్వామివారు కనఁబడిరి. రాజు ఆశ్చర్యమానమగ్నుఁడయ్యెను. స్వామిని నిజముగ అవతారపురుషుఁడని తలంచెను. వెంటనే స్వామివారియొక్క శిష్యుఁడాయెను. ఇట్లు కొంత

కాలము విజయనగరప్రాంత దేశములయందు తుంగభద్రాతీరమున చరించి అచటనుండి గుజరాతుకు తర్లెను. గుజరాతున ఇదేరీతిగ గానములను నృత్యములను గావించుచుండ నొకనాఁడు వీరిని వెంబడించిన దొంగలనాయకుఁడు కృష్ణస్మరణచే మైమఱచి ఆనందపరవశత్వమునొంది దివ్యతేజస్సొకటి కానరాగా వైకుంఠమునకుపోయెను. ఆ దేశస్థులందఱు ఈవింతనుచూచి కృష్ణనామస్మరణ చేయుచు ఆనాయకుని కళేబరమునకు సమాధిగావించిరి.

స్వామివారు బృందావనమున కరుగుట.

పిదప గుజరాతునుండి బయలుదేరి తన యావచ్ఛిష్యబృందముతో పూర్వమున శ్రీకృష్ణమూర్తి పుట్టి, పెరిగి, బాలక్రీడలు సలిపిన బృందావనమునకు కృష్ణచైతన్యులు యాత్రఁ బోయిరి. బృందావనమున కాలిడి యచ్చటి గోకులమును గోవర్ధన పర్వతమును, యమునానదిని వీక్షించగనే స్వామికి తనకృష్ణావతారముజ్ఞప్తికివచ్చి పలుమాఱు మైమఱచుటయు, మూర్ఛిల్లుటయు, కృష్ణనామస్మరణచేయగనే స్మృతితెలియుటయునై యుండిరి బృందావనమున స్వామి మిక్కిలియానందముతో తనశిష్యులుసహా కాలక్షేపముచేసిరి. కృష్ణభజనలను గావించిరి. ఎల్లప్పుడు హరినామస్మరణలతోనే కాలమును

బుచ్చిరి. ఇచ్చటనుండి వెడలి కాశీక్షేత్రవాసము గావింప నుద్యుక్తుఁడై స్వామియుండగా నప్పటికి పండ్రెండేండ్లకు మునుపు స్వామి తూర్పుబంగాళకు పోయియుండినవుడు అచ్చట తపనమిశ్రులను వారిని పొడగాంచి వారు తనకు తరణోపాయము నుపదేశింపమనగా, వారికి తాను కొన్నిదినములకు వారణాసీపురికి రానున్నాననియు, నచ్చటికిపోయి తపనమిశ్రులనందాక క్షేత్రవాసముచేయుచుండవలయుననియు నాజ్ఞనొసంగియుండిరి. ఆతపనమిశ్రులు వీరిరాకకై కాశీక్షేత్రమున నిన్నినాళ్లు వేచియుండిరి. స్వామి బృందావనమునకువచ్చి యచ్చోట జనులకు తనయద్భుతమహిమలను గాన్పించుచున్నారని విని తపనమిశ్రులుస్వామినెదుర్కొని కాశీక్షేత్రమునకు తోడ్కొనిపోవుటకై బృందావనమునకరుదెంచెను. తపనమిశ్రులను చూడగానే స్వామి పరవశమును జెందెను. ఆనందాశ్రువులను గార్చెను. వెంటనేతపనమిశ్రులతో ప్రయాణమై పుణ్యగుణాలరాశియైన కాశికి పయనమై కొన్నాళ్లకు కాశికాపురి చేరెను.

కృష్ణచైతన్యస్వామి, ప్రకాశానందస్వామి.

ఆపట్టణమునకు యథారీతిగ తనశిష్యవర్గముతో హరినామస్మరణను, కృష్ణభజనలను చేయుచు సందర్భించినవుడెల్లను మైమఱచి నృత్యము గావిం

చుచుండెను. అప్పుడు కాశికాపురియందు ఒకగొప్ప
విద్వాంసుఁడు సన్న్యసించినవా రుండిరి. వారిపేరు
ప్రకాశానందస్వాములు. కృష్ణచైతన్యులతో జగన్నా
థక్షేత్రమున సమాగమమై వారికి శిష్యుఁడైన
వాసుదేవ సార్వభౌమ భట్టాచార్యునకీ ప్రకాశా
నందస్వామిగురువు. తర్క, వ్యాకరణ, మీమాంస
వేదాంతములయందు వీరితో సమానులు ఆకాల
మున కాశీలో నెవ్వరును లేరు. వీరు కృష్ణచైతన్య
స్వామియొక్క కీర్తిని అనేకదినములుగ వినుచుం
డిరి. ఇంత పండితుఁడయ్యును ప్రకాశానందులకు
భక్తిప్రేమలు లేవు, అహంకార మమకారములను
వదలినవారు కారు. శ్రీకృష్ణచైతన్యస్వామి కాశికా
పురి చేరిరని తెలియగనే ప్రకాశానందులీస్వామి
తనశిష్యుఁడగు వాసుదేవ భట్టాచార్యుని వోడించి
నవాఁడట. అనేక శిష్యవర్గముతో గూడియుండు
నట. బహుపాండిత్యము గలవాఁడట. ఎట్టిపండితు
నైనను వాదమున నోడగొట్టగల ప్రతిభాశాలియట.
ఇందఱును గెలుచుట కీయనపాండిత్యము దక్క వేరే
మంత్రశక్తియుండును. కాకున్న నొకనికైనను ఈ
భారతదేశమున వీరేల యోడిపోరు. అతనికీర్తిమా
యుటకనియే కాశికివచ్చెను. భజనలు చేయునట.
పాటలు పాడునట నృత్యమును ద్రొక్కునట. వేద
శాస్త్రములో నట, విట, గాయకుల కెట్టిమర్యాద

లేదు. దూషితవృత్తి నవలంబించిన కృష్ణచైతన్యు
లను ఓడగొట్టి నాశిష్యునకీయనవలన గలిగిన పరా
భవమును మాయించెదనని తలపోయుచు మిక్కిలి
మాత్సర్యముతో నుండెను. కాశీక్షేత్రముననుండిన
విద్వాంసులు, సన్న్యాసులు వీరిరువురకు నెప్పుడు
సమాగమమగునా యని యువ్విళ్లూరుచుండిరి.
ఇట్లుండ నొకసంపన్నుఁడు కాశీక్షేత్రముననుండు
సన్న్యాసబృందమునకు వారివారి శిష్యసమేతముగ
భిక్షనిడుట కియ్యకొనెను. ఆవిందుకు కాశీలోని
సన్న్యాసులందఱు నాహ్వానింపఁబడిరి. గంగాతీర
మున పాకలు, పందిళ్లు వేర్పరచిరి. అందఱు నచ్చో
టఁ జేరిరి. స్వామి కృష్ణచైతన్యులును తనశిష్యవర్గ
ముతో నాస్థలమున కేగెను. ప్రకాశానందులును
అచ్చటి కేతెంచిరి. వారు కాశీపురిలో ప్రఖ్యా
తిగాంచిన విద్వాంసులుగాన వారికై ప్రత్యేకముగ
నొక యున్నతపీఠము నమర్చియుంచిరి. అప్పుడు
ప్రకాశానందులు వీరిలో చైతన్యస్వామి ఎవరని
యడుగగా నొకచో మూలలోన నమర్చియుంచిన
పందిటిలో గూర్చుండి తన శిష్యవర్గముతో కృష్ణ
నామస్మరణ గావించుచుండువారే కృష్ణచైతన్యులని
ఎవరో చూపగా తెలిసికొని వెంటనే స్వామివారి
వద్దకేగి వారితో ప్రప్రథమమున వినయమును

నటించి వారిని తానుండు ప్రదేశమునకు పిలుచు కొనివచ్చి తనప్రక్కన కూర్చుండఁ బెట్టుకొనెను.

వెంటనే ప్రకాశానందులు కృష్ణచైతన్యస్వామిని స్వామీ! మీరే యేశాస్త్రములను పఠియించి యున్నారు. వేదాధ్యయనమున పూర్తిగ సస్వరముతో గావించియున్నారా? బ్రహ్మసూత్రభాష్యశాంతి నెన్నిమార్లు గావించియున్నారు? అని వారి పాండిత్యము నరయుటకు ప్రారంభింపఁగా శ్రీకృష్ణచైతన్యులు తాననధీతవేదశాస్త్రజ్ఞుఁడననియు, వేదశాస్త్రసూత్రములయందు తనమనస్సు నిలువదనియు నుడివెను. కేవలము మమకారము ఆత్మగౌరవము వీనినే ప్రధానముగ గలిగిన ప్రకాశానందులు సన్న్యాసులకు గూడని నృత్యగీతములతో హరినామస్మరణను మీరు చేయుదురట అది యథార్థమేనా యనియడిగెను. చైతన్యస్వామి అందులకవుననెను.

*శ్లో. "యః శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః,
న సంసిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్."
(గీ. ౧౬-౨౩)

"వేదశాస్త్రవిరుద్ధమగు కార్యమును చేయ తగునా? అట్లుచేయుటకు ప్రమాణమునుఁ జూపె

* ఎవఁడు శాస్త్రోక్తవిధినివదలి యిచ్చచొప్పున జేయుచున్నాఁడో వానికి సిద్ధిలభింపదు; సుఖములేదు; ఉత్తమగతియు లభింపదు.

దరా?" యని సగర్వముతో బలికెను. ప్రకాశానందస్వామి తనకు కష్టమేమియులేకనే చైతన్యులు తనకు లోబడనున్నాడు. తన అకార్యకరణమును తానే యొప్పికొనెను.

†'ఇదమద్య మయాలబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్'
అనునట్లును,
‡'అసౌ మయా హతః శత్రుః'

అను గీతావచనములచొప్పున ప్రకాశనందస్వామి ఆసురీసంపదను నవలంబించినవారు. కావున సులభముగనే శ్రీకృష్ణచైతన్య లోడిరని తలంచెను. అయితే కృష్ణచైతన్యులు మాత్రము "తేజః క్షమా ధృతి శ్శౌచమద్రోహో నాతిమానితా, భవంతి సంపదం దైవి" యను గీతావచనానుసారముగ దైవీసంపద నవలంబించినవారు గాన, త్రుళ్లిపడక శ్రీప్రకాశానందులు ఏలఅకార్యకరణత్వమును తనకారోపించి యధిక్షేపించిరో దానికిట్లు జబాబిచ్చిరి. "స్వామీ! వేదాధ్యయనము, శాస్త్రాభ్యాసము, బ్రహ్మసూత్రముల భాష్యశాంతి, ఆశ్రమధర్మాచరణములు ఇవి అన్నిటిని చేయుట సత్యజ్ఞానస్వరూపుఁడును, అనంతవ్యాప్తిఁ గలవాఁడును అగు పరబ్రహ్మమునుఁ దెలి

† నేనీదినమున ఇంతసంపాదించితిని. శేషాకోరికను నెరవేర్చుకొందును. గీ. ౧౬. ౧౩.

‡ ఈశత్రువులనే జంపితిని. గీ. ౧౬. ౧౪.

సికొని ఆచిదాత్మయందు ఆత్మానుసంధానమునుఁ
గావించి, ఆనందమయుఁ డగుటకేకదా ప్రతిజీవి
యు యత్నించవలయును? దానినేకదా యోగులు
బ్రహ్మానంద మనెదరు? ఆబ్రహ్మానందమును సాధన
చతుష్టయములో ప్రధానమగు శమదమాది షట్క
సంపత్తిచేతకాని పొందుటకు వీలు లేదు.

శమదమాదిషట్కసంపత్తి ననుష్ఠానమునకుఁ
దెచ్చుకొనుటలో మహావిద్వాంసులే యశక్తులై
యున్నారు. మఱియును వేదాభ్యాసము శాస్త్రా
భ్యాసము మొదలగువానివలన నాకానందము కలు
గదు. నాకు కృష్ణభజన, హరినామసంకీర్తన నృత్య
గీతములతో చేసినప్పుడు గలుగుఆనందమే బ్రహ్మా
నందముగానున్నది. ఈవిధమగు నానందానుభవ
మునకు సెలవిండని నాగురువులనుగోరగా, నాగురు
వులవా రందులకు సమ్మతించుటచే గురువాజ్ఞాను
సారినై వర్తించుచున్నానేకాని అన్యథా లేదనియు,
గురువాజ్ఞానుసారముగ చేయుకార్యము లన్నియు
శాస్త్రీయములనియు, శాస్త్రవిధికి వ్యతిరేకముగ
కామకారకుఁడై నేను దేనిని చేయుట లేదనియు, గురు
వాజ్ఞచొప్పునచేయు నా ఆత్మానుసంధానముచే
బ్రహ్మానంద నిమగ్నుఁడగు నాకు వేఱుమార్గములు
రుచించవనియు నతివినయముతోఁ బలికెను. శ్రీ
ప్రకాశానందస్వామి యాప్రత్యుత్తరములోని

గూఢార్థమును విద్వాంసుఁడు గాన గ్రహించి, తా
నెంత విద్యాపరిశ్రమను జేసియు, ఎన్నిమారులు
భాష్యశాంతులను గావించియు, నెంతవయోవృద్ధుఁ
డయ్యును తన కాత్మానుసంధానముచే పరమానం
దము లభించకపోయినందునకు వగచి, భక్తిమా
ర్గము పరమానందమును పొందుటకు సులభమార్గ
మని గౌరంగస్వామివారి సదుత్తరమునకు లజ్జించి
వేఱుప్రశ్నల నడుగుటకు వీలు లేనివాఁ డయ్యెను.
ఈలోపుగ భిక్షకు కాలమైనది. అందఱును లేచిరి.
అచ్చట గూడియుండిన వేలకొలది సన్న్యాసులు,
పండితులు, శ్రీకృష్ణచైతన్యస్వామివారి సూక్ష్మబుద్ధి
కిని, దూరదృష్టికిని వినయాది సద్గుణములకును పౌర
వడని శాస్త్రజన్యజ్ఞానమునకును, అనుభవముతో
గూడుకొనిన బ్రహ్మజ్ఞానమునకును అనేకవిధముల
నుతించిరి. ఇంతలో భిక్షకు లందఱును లేచిరి.
అచ్చటకూడియుండిన వేలకొలది సన్న్యాసులు,
పండితులు శ్రీకృష్ణచైతన్యస్వామివారి సూక్ష్మబుద్ధి
కిని, దూరదృష్టికిని, వినయాది సద్గుణములకును,
అనుభవముతో గూడుకొనిన బ్రహ్మజ్ఞానమునకును
అనేకవిధముల నుతించిరి

ఇట్లు ప్రకాశానందస్వామి వారికి తనలోనుండు
విశేషమును తెలియఁజేసెను. అటుపిదప కొన్నా

లైనతర్వాత నొకానొకదినము సాయంసమయమున కాలభైరవస్వామివారి యాలయమున శిష్యులతోఁగూడుకొని హరినామసంకీర్తనమునుగావించుచుండిన శ్రీకృష్ణచైతన్యులను ఆదారిన గంగాతీరమున కనుష్ఠానార్థమై పోవుచుండిన ప్రకాశానందస్వామి దర్శించెను. శ్రీకృష్ణచైతన్యులు మైమఱచి చేయునృత్యమును, కృష్ణభజనను, కన్నులఱెప్పలు వాల్చక నిదానించి ప్రకాశానందస్వామి ఆరాత్రియంతయు వీక్షించుచునేయుండెను. అప్పుడు శ్రీచైతన్యస్వామివారిదేహమున నొక దివ్యతేజస్సు వొడమెను. ఆతేజస్సు కోటిసూర్యప్రభకు సమానమై యుండినది. ఆకాంతితోఁగూడుకొని మైమఱచి కృష్ణకర్ణామృతమును పాడుచు పరబ్రహ్మాయం దైక్యమైన ఆత్మనుగలవాఁడై మైమఱచి కన్నీరుగార్చుచుండగా శ్రీ ప్రకాశానందస్వామి అట్టి పరమాత్మానుసంధానముగల దివ్యమూర్తి కావుననే శ్రీకృష్ణచైతన్యస్వామిశరణమును బొంది తానున్నదరింపఁగోరి పాదములపై వ్రాలెను. వెంటనే ప్రభాతమయ్యెను. భజనను నిలిపిరి శ్రీకృష్ణచైతన్యులు. ఇపుడు శ్రీకృష్ణచైతన్యులకు స్మృతివచ్చెను. తనపాదాశ్రితులగు ప్రకాశానందులను లేవనెత్తెను. ఇంతలో నిరువురును భజనలను, హరినామ సంకీర్తన

మును ప్రారంభించిరి. ఇరువురును స్మృతిదప్పి కన్నీరుగార్చుచు క్రిందపడిరి. వెంటనే స్వామిచుట్టు భజన గావించుచుండు శిష్యులును, భక్తులును, వారిరువురకు ఉపచారములనుఁ జేసిరి. వెంటనే ఇరువురు నుపశమిల్లిరి. ప్రకాశానందులు శ్రీ కృష్ణచైతన్యులతో, “స్వామీ! నేనింత విద్వాంసుఁడను, వృద్ధుఁడ నైనను నాకిన్నాళ్లు మమకారము వదలలేదు. ఈదినమున నాజన్మము సాఫల్యమైనది. ఈసమయమున నాపని ఈడేరినది. ఇన్నాళ్లకు నాయనుష్ఠానమునకు ప్రతిష్ఠవచ్చినది. నీవే నాసద్గురుఁడవు. నీమహిమను నాకు పొగడతరమా? నీయనుగ్రహమువలన ఇప్పుడు నామమకారము నశించె” నని ఏడువసాగెను. అప్పుడు శ్రీకృష్ణచైతన్యస్వామి అచ్చోటనుండిన ప్రకాశానందులను, ఇతరసన్న్యాసులను, శిష్యులను, భక్తజనులను, “హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్, కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా” పరబ్రహ్మను పొందుటకు ఈకలియుగమున హరినామస్మరణముదప్ప గతి వేరేలేదు. వేరుగతి లేనేలేదని ముమ్మాఱు స్పష్టముగా ప్రబోధగావించు సమయమున పరమాత్మానుసంధానము కావలయునని కోరువారు, ఆత్మస్తుతి, పరనిందలను వదలవలయుననియు, గడ్డిపోచకంటే అధికమగు అణకువనుబొంది, తన్ను

నరుకుచున్నవానికి సైతము నీడనిచ్చువృక్షము చాడ్పున సమస్తభూతరాశికి ఓర్పుతో నాదరమును జూపవలయును. యావత్ప్రపంచసృష్టికి కారణభూతుఁడగు హరికీర్తన, కృష్ణభజనము ఏమరకూడదు. మహామంత్రమును సదాపఠించుటచే భగవంతునిమీఁదిప్రేమ భక్తి యపారముగ గలుగుచున్నది. భక్తి గలుగుటతోడనే బ్రహ్మానందము పొడముచున్నది. ఈబ్రహ్మానందము సర్వజనులును కోరదగినది. ఆవస్తువుయొక్క ప్రాప్తికొఱకే చతురాశ్రమములలో వేదవేదాంగ అధ్యయనములు, శాస్త్రాభ్యాసములు, ఉపనిషత్పారాయణములు, అగ్నిష్టోమాదికర్మములు, సూత్రభాష్య శాంతిమొదలగునవి విద్వాంసులు చేయుదురు. నాలుగుజాతులవారును సులభముగ నాయానందమును బొందుటకొఱకు కలిసంతారోపనిషత్తునందు సర్వకాలములలోను పఠించుటకు యోగ్యమైన మహామంత్రము

హరేరామ హరేరామ రామరామ హరేహరే,
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే.

ను పూర్వము నారదులకు బ్రహ్మ నుపదేశించెను. భక్తితో నామంత్రోచ్చారణచేసిన కలియుగమున నాచరించు మహాపాపములను సూర్యరశ్మి హిమమును తొలగించునట్లు తొలగించుకొని నిర్మలహృదయులై పరమాత్మునితో సాయుజ్యమును నిస్సం

శయముగ బొందగలరు ఆమంత్రమును ననేకపర్యాయములు జపించిన బ్రహ్మజ్ఞానులగుదురు కలిలో తరించుట కిదియేమార్గము. ఈమార్గముతప్ప వేరు మార్గములేదు. అని ముమ్మారు ప్రబోధించెను.

ఇట్లు కాశీక్షేత్రవాసము కొన్నాళ్లు జేసినపిదప తన స్వస్థానమైన నవద్వీపమునకే తెంచి అచ్చోటె తల్లి భార్యమొదలగు పూర్వాశ్రమపు బంధువులకున్ను, స్నేహితులకును, ఆదేశమందలి శిష్యులకును దర్శనమిచ్చి మరల జగన్నాథమునకు బయలువెడలగా భార్యవిష్ణుప్రియ స్వామిపాదములమీఁదఁబడి మిక్కిలి దుఃఖముతో స్వామివారిస్మరణచిహ్నముగా నేదైనను తనకిచ్చిపోవలయునని కోరగా తాను సన్న్యాసిగనుక తనయొద్దఏదియు అట్టిచ్చుటకు లేదనెను. పిమ్మట విష్ణుప్రియ స్వామివారిపాదుకలను భరతుఁడు శ్రీరామచంద్రుని కోరినట్లు కోరెను. శ్రీకృష్ణచైతన్యస్వామి మిక్కిలి సంతసముతో వానిని ఆమెకొఱకొసగి జగన్నాథమునకుఁ బోయెను. ఈపాదుకలు జగన్నాథక్షేత్రమున నొక దేవాలయమున పూజింపఁబడుచున్నదట. జగన్నాథమున యథారీతిగ హరినామసంకీర్తనము, కృష్ణభజన, హరికథాకాలక్షేపములతో వారికి నలువది ఎనిమిది సంవత్సరములవరకు కాలమును గడపిరి. అచ్చట తనయొద్దకూడినజనులు తన్ను నిజమైనహరి

దాసులనెట్లు నెఱుంగవలయునని యొకప్పుడడుగగా ఎట్టిపాపాత్ముఁడైనను ఒకపర్యాయము హరినామస్మరణచేసినచో వాఁడు హరిదాసని ఎఱుంగవలయునని వారికి సమాధానమును చెప్పెను. ఆజనులందఱును ఆనందమున మునింగినవారై సమాధానముచే తృప్తిపడి తమతమనివాసముల కరిగిరి.

వారినలుఁవది ఎనుమదవయేట నొకదినము రాత్రి కృష్ణభజన కాగానే అత్యానందముతో నృత్యము జేయుచుండఁగా కొంతదూరమున శ్రీకృష్ణమూర్తి నిలుచుకొని యుండునట్లు స్వామివారికిని ఆచోటనుండినవారి కందఱకును దర్శనమిచ్చెను. శ్రీకృష్ణమూర్తిని పట్టుకొన చైతన్యస్వామి గమకించగా శ్రీకృష్ణమూర్తి పరుగెత్తనారంభించెను. శ్రీకృష్ణమూర్తివెంటనే చైతన్యస్వామియు నతివేగముగ పరుగిడెను. శ్రీకృష్ణమూర్తి సముద్రమున జొచ్చెను. వారివెంటనే చైతన్యస్వామియు సముద్రమునుజొచ్చి కానరాకపోయెను. ఇదియే వారి పరమపద గమనము.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1924.

END OF
TITLE